

# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 176 పేజీలు : 8 వెల : రూ.2/- బుధవారం 22 జులై 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool





- కాంగ్రెస్ ధర్నాతో స్వల్ప ఉద్రిక్తత
- బలవంతంగా అరెస్ట్ చేసి తరలించిన పోలీసులు
- రాహుల్ సహా కాంగ్రెస్ నేతల అరెస్ట్

## ప్రధాని నివాసం వద్ద
# కాంగ్రెస్ మెరుపు ధర్నా

**న్యూఢిల్లీ,మన జనప్రగతి జులై 21:**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాసం ముందు ఆందోళన చేసిన రాహుల్ గాంధీ.. కాంగ్రెస్, మిత్రపక్షాల ఎంపీలను పోలీసులు మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కి తరలించారు. మందిర్ మార్గ్ పోలీసు స్టేషన్‌లో ఉన్న ఎంపీలను కలిసేందుకు కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్ పర్సన్ సోనియా గాంధీ వెళ్లారు. అయితే, పోలీసులు సోనియాగాంధీని లోపలికి అనుమతించలేదు. భారత ప్రధాని నరేంద్ర మోదీ నివాసం దగ్గర కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ధర్నా చేపట్టారు. సోమవారం జంతర్‌మంతర్ వద్ద నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు నిరసనగా చేపట్టిన ఈ ధర్నాలో రాహుల్‌తో పాటు ఖర్గే, కేసీ, ప్రియాంక, పలువురు కాంగ్రెస్, మిత్ర పక్షాల ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ మిగతా2లో...

# ఎపిలో అరబ్ ఎమిరేట్స్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు

● సిఎం చంద్రబాబుతో అరబ్ మంత్రి అబ్దుల్లా భేటీ



**అమరావతి,మన జనప్రగతి జులై 21:** దావోస్ సదస్సులో ఈ ఏడాది కుదర్చుకున్న మరో కీలక ఒప్పందం సాకారమయ్యే దిశగా ముందడుగు పడింది. ఆంధ్రప్రదేశ్‌లో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) ముందుకు వచ్చింది. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడితో యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీ నేతృత్వంలోని మిగతా2లో...

## తమ్మినేని భూ ఆక్రమణపై
# చర్యలు తప్పవు

● వైసిపి ఐదేళ్ల భూభాగోతాలపై పూర్తిస్థాయి విచారణ

● రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి



**అమరావతి,మన జనప్రగతి జులై 21:** వైసీపీ నేత, ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారం భూ అక్రమాలతో తప్పకుండా చర్యలు ఉంటాయని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు భూమి పట్ల చట్టవిరుద్ధంగా వ్యవహరించిన వారిపై కూడా చర్యలు ఉంటాయని తేల్చిచెప్పారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలోని ఐదేళ్లలో జరిగిన అన్ని అక్రమాలపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మంగళవారం అమరావతిలో మంత్రి మీడియాతో మాట్లాడారు. గొడ్డలి పార్టీకి రాజకీయ స్వలాభం కోసమే అసత్య ఆరోపణలు మిగతా2లో...



## పోలవరాన్ని గాలికి
# వదిలేసిన జగన్

- ఇరిగేషన్ వ్యవస్థను విధ్వంసం చేశారు
- మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల

**అమరావతి,మన జనప్రగతి జులై 21:** నీటి ప్రాధాన్యాన్ని టిడిపి వ్యవస్థాపకుడు అన్న ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకూ గుర్తించారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలు పోలవరం, ఇతర ఇరిగేషన్ ప్రాజెక్టులపై మంత్రి మిగతా2లో...

## తమ్మినేని సీతారాంనకు
# చుక్కెదురు

● క్వాష్ పిటిషన్ తిరస్కరించిన ఎపి హైకోర్టు




## దేశ యువత కోసం రాహుల్ పోరాటం

- ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి పోస్ట్






## దిష్టిబొమ్మ దగ్ధం చేయడంతో ఏం లాభం

గడ్డి తగులబడుతందే తప్ప ప్రయోజనం ఉండదు

ఎమ్మార్పీస్ చర్యకు అంబటి రాంబాబు కౌంటర్

**గుంటూరు,మన జనప్రగతి జులై 21:** ఎమ్మార్పీఎస్ నాయకులు తన దిష్టిబొమ్మను దగ్ధం చేయడంపై మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. హోంశాఖ మంత్రి అనితను తాను పరుష పదజాలంతో విమర్శించానని, కుల దూషణ చేశానని వస్తున్న ఆరోపణలను ఆయన పూర్తిగా ఖండించారు. మిగతా2లో...

## జిహెచ్ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

ప్రజల నుంచి పదివేల కోట్లు వసూళ్లకు పన్నాగం

భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు విమర్శలు







## రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

ఎల్‌నినోతో వర్షాభావంపై అధికారులతో చర్చలు

కార్యాచరణతో ముందుకు సాగాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ ఆదేశం

**రంగారెడ్డి,మన జనప్రగతి జులై 21:** ఎల్‌నినో ప్రభావంతో నీటి ఎద్దడి వచ్చే అవకాశం ఉన్నందున రైతులను పండ్ల తోటలు, అరుతడి పంటల వైపు మళ్లించాలని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో మిగతా2లో...




## కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

నీళ్లు కిందికి పోతున్నా పట్టింపు లేదా..?

దేవాదుల విషయంలోనూ అదే ద్రోహం

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

మీడియా సమావేశంలో మండిపడ్డ హరీష్ రావు

మనజనప్రగతి
21 - 07 - 2026

# ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ మెరుపు ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

నేతలు చేతులకుసంకెళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఈ నిరసనలు ఉద్రిక్తతకు దారి తీయటంతో పోలీసులు బలవంతంగా వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాహుల్, ఖర్గే, ప్రియాంకలను అరెస్ట్ చేసి బలవంతంగా తరలించారు. ఇకపోతే మంగళవారం ఈ నిరసనలు పొలిటికల్ టర్న్ తీసుకున్నాయి. కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్రమోడీ నివాసం ముందు ధర్నా చేశారు. కాంగ్రెస్ నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జున ఖర్గే, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌లు కూడా ఈ ధర్నాలో పాల్గొన్నారు. విద్యార్థులపై దాడికి నిరసనగా ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని పిలుపునిచ్చారు. అయితే కాంగ్రెస్ ధర్నా చేసిన ప్రాంతాన్ని పోలీసులు ఖాళీ చేయించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీను అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కేసీ వేణుగోపాల్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్, కర్ణాటక, కేరళ సీఎంలు డీకే శివకుమార్, సతీషన్‌తో పాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని బస్సుల్లో తరలించారు. రాహుల్ గాంధీ, ప్రియాంకను పోలీసులు వేర్వేరు స్టేషన్లకు తరలించారు. ఈ క్రమంలో మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌లో వున్న ప్రియాంకా గాంధీ వాద్రాను కలిసేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ అక్కడికి చేరుకున్నారు. తొలుత ఆమెను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. ఆ తర్వాత కాసేపటికి లోపలికి పంపడంతో ప్రియాంకను ఆమె కలిశారు. ఇదిలా ఉండగా.. రాహుల్‌ను మోడల్ టౌన్‌లోని ఛత్రసాల్ స్టేడియానికి పోలీసులు తరలించినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ ధర్నా వద్దకు వచ్చిన కేంద్ర సహాయ మంత్రి, ప్రధాని కార్యాలయ బాధ్యతలు చూస్తున్న జితేంద్ర సింగ్, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్.. రాహుల్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్రం ముందు రాహుల్ ప్రధానంగా రెండు డిమాండ్లు ఉంచారు. ఎట్టిపరిస్థితుల్లో విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, నిన్న విద్యార్థులపై లాఠీఛార్జి చేసిన ఘటనపై పార్లమెంటు ఉభయ సభల్లో కేంద్రం స్పందించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు తాము ఈ ఆందోళనలు ఆపేది లేదని, ఇక్కడి నుంచి కదిలేది లేదని రాహుల్ తేల్చి చెప్పారు. ఆ తర్వాత దిల్లీ పోలీసులతో పాటు ఆర్‌పీఎఫ్, ఆర్ఏఎఫ్ బలగాలు భారీగా మోహరించి ప్రధాని నివాసం ముందు ధర్నా చేస్తున్న నేతలందరినీ అదుపులోకి తీసుకోవడంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. డిమాండ్లపై రాహుల్ మాట మార్చారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ విమర్శించారు. రాహుల్ సహా కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోకముందు మీడియాతో ఆయన మాట్లాడారు. 'నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలని తొలుత రాహుల్ కోరారు. దానిపై హామీ ఇస్తే ధర్నా విరమిస్తామన్నారు. పార్లమెంట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చాం. ఇప్పుడు మాట మార్చి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోరుతున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ఇలా మాట మార్చడం సరికాదు. రాహుల్ ప్రవర్తన, ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. యాగీ చేయడమే ఆయన ఉద్దేశం. రాజకీయ లబ్ది కోసమే రాహుల్ ప్రయత్నిస్తున్నారు. మా ప్రభుత్వం యువతకు అన్యాయం చేయదు'అని జితేంద్రసింగ్ అన్నారు.

# జిహెచ్ఎంసి ఎన్నికల కోసమే ఇళ్ల నాటకం

**హైదరాబాద్,మన జనప్రగతి జులై 21:**జీహెచ్ఎంసీ ఎన్నికలు వస్తున్నాయనే ఇళ్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకం ఆడుతోందని బిజెపి దుయ్యబట్టింది. 7వేల ఇళ్లకు 10వేల దరఖాస్తులు వస్తాయి.
ఒక్కో దరఖాస్తుకు రూ.10వేల చొప్పున తీసుకుంటే ప్రభుత్వానికి రూ.వెయ్యికోట్ల రాబడి వస్తుందని, క్యూర్ పేరుతో ప్రజలకు ప్రభుత్వం పెయిన్ తెస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఎద్దేవా చేశారు. నాంపల్లిలో భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.
క్యూర్‌లో శాస్త్రీయ బద్ధమైన పన్నుల విధానం లేదు. ట్యాక్స్ దోపిడీతో ప్రజలపై భారం పడుతుంది. ఈ చట్టాన్ని రెసిడెన్షియల్ అసోసియేషన్లు వ్యతిరేకిస్తున్నాయి. ఇది సరైన చట్టం కాదు. ఎవరితోనూ చర్చించకుండా దీన్ని అమలు చేస్తున్నారు. రాజీవ్ స్వగృహ పేరుతో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మించిన ఇళ్లు అలాగే ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసి పేదలకు ఇవ్వాలి. క్యూర్‌పై వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాకే చట్టాన్ని అమలు చేయాలన్నారు. రూ.వెయ్యి కోట్ల కోసం పేదల నుంచి రూ.10వేలు తీసుకోవడం సరికాదని రామచందర్‌రావు అన్నారు.

# రైతులను ఆరుతడి పంటలవైపు మళ్లించాలి

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌నినో ప్రభావంపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం తీవ్రత ప్రజలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి వచ్చే పంటలపై దృష్టి పెట్టాలని అన్నారు. రైతులను తక్కువ నీరు అవసరమయ్యే పంటలు, పండ్ల తోటలు, అరుతడి పంటలు సాగు చేసేందుకు ప్రోత్సహించాలని సూచించారు. ఈ దిశగా వ్యవసాయ, ఉద్యాన అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ, పాడి పరిశ్రమలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఎల్‌నినో బారిన ప్రజలు పడకుండా చూసే బాధ్యత పూర్తిగా జిల్లా యంత్రాంగంపైనే ఉందని స్పీకర్ స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేయాలని, అవసరమైన చోట నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమం చివరలో వర్షపు నీటి సంరక్షణ కు సంబంధించిన తెలంగాణ జలసిరి పోస్టర్ విడదల చేశారు. ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, చేవెళ్ల ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, శంకర్, కాలే యాదయ్య ఇంకా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వివిధ విభగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై ఇన్ని అబద్ధాలా?

**హైదరాబాద్,మన జనప్రగతి జులై 21:** కాళేశ్వరం దగ్గర చిల్లర రాజకీయం చేయడంపై సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మండిపడ్డారు. మరి దేవాదుల దగ్గర నీకు ఏం అడ్డమొచ్చిందని ప్రశ్నించారు. దేవాదుల విషయంలో నాటి నుంచి నేటి దాకా కాంగ్రెస్ పార్టీది ద్రోహమే అని మండిపడ్డారు. 2011లో మూడేళ్లు దేవాదులను మూలకు పడేసిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుచేశారు. ఎల్‌నినో పేరు చెప్పి ఎగనామం పెడితే బీఆర్ఎస్ ఊరుకోదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి బొట్టును ఒడిసి పట్టాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డికి ఉందని అన్నారు. మాట్లాడితే తిట్లు, ఒట్లు తప్ప ఏమీ లేదని మండిపడ్డారు. మొన్న రాములోరి మీద కూడా ఒట్టు పెట్టిండు అని తెలిపారు. ఒట్ల మీద ఉన్న శ్రద్ధ.. నీటి బొట్ల మీద పెట్టాలని హితవుపలికారు. లేదంటే చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమని హెచ్చరించారు. నీళ్లు రాకున్నా.. కరెంటు లేకున్నా రేవంత్ రెడ్డిదే బాధ్యత అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. జూన్ 1 నుంచి నేటి వరకు సమ్మక్క బ్యారేజీ నుంచి 105 టీఎంసీల నీరు కిందకు పోయిందని తెలిపారు. నీళ్లన్నీ ఆంధ్రాకు తరలిపోయాయని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం 1.9 టీఎంసీలు మాత్రమే ఎత్తిందని చెప్పారు. నాలుగు రోజులకు ఒక టీఎంసీ ఎత్తవచ్చని.. 50 రోజులకు 12 టీఎంసీలు ఎత్తే అవకాశం ఉందని తెలిపారు. కానీ కనీసం రెండు టీఎంసీలు కూడా ఎత్తలేదని విమర్శించారు. ఇది నేరపూరిత నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. నీ ప్రభుత్వానికి ఏం శిక్ష వేయాలో నువ్వే చెప్పు అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. ఇన్ని నీళు ఉంటే ఎత్తవా అని మండిపడ్డారు. ఇదేనా రైతులపై నీకు ఉన్న చిత్తశుద్ధి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్న దేవాదులను నిర్వహించే సత్తా మీకు లేదా అని అడిగారు. మీ వైఫల్యం వల్ల వరంగల్ జిల్లా




వ్యవసాయ సంక్షోభంలో మునిగిపోయిందని అన్నారు. వరంగల్, కరీంనగర్ జిల్లాలు ఆగమయ్యే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ కాంగ్రెస్ సర్కార్ వైఫల్యమే అని ఆరోపించారు. 22 రిజర్వాయర్ల కెపాసిటీ 12 టీఎంసీలు అని.. ప్రతిరోజు పావు టీఎంసీ ఎత్తవచ్చని తెలిపారు. అంటే ఇప్పటికి 12 టీఎంసీలు ఎత్తిపోయవచ్చని పేర్కొన్నారు. మరెందుకు 22 రిజర్వాయర్లు నింపలేదని ప్రశ్నించారు. దేవాదుల నుంచి 105 టీఎంసీలు కిందకు తరలిపోయాయని తెలిపారు. ఈ రోజు కూడా దేవాదులలో 78 మీటర్ల ఎత్తులో నది ప్రవహిస్తున్నదని పేర్కొన్నారు. 73 మీటర్లు ఉంటే చాలు మోటార్లు నడుస్తాయని.. 78 మీటర్లు ఉన్నప్పటికీ మోటార్లు నడిపించడం లేదని చెప్పారు. ఎందుకు నీళ్లు ఎత్తిపోయడం లేదని, ఏమిటీ నిర్లక్ష్యమని ప్రశ్నించారు. అతి తక్కువ వర్షపాతం పడిన జిల్లా వరంగల్ జిల్లా అని హరీశ్‌రావు తెలిపారు. రెయిన్‌ఫాల్ తక్కువ ఉంటే సమ్మక్క బ్యారేజీ నుంచి నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. ఎందుకు నీళ్లను కిందకు జారవిడుస్తున్నారని ప్రశ్నించారు. మేం ప్రెస్‌మీట్ పెట్టగానే.. దేవాదులలో రెండు మోటార్లు స్టార్ట్ చేశారని తెలిపారు. మేం ప్రశ్నిస్తే తప్ప నీళ్లు ఎత్తిపోయారా అని నిలదీశారు. ప్రధాన ప్రతిపక్షంగా రైతుల పక్కాన బాధ్యతాయుత పోరాటం చేస్తున్నామని మండిపడ్డారు.దేవాదుల ప్రాజెక్టులో 10 మోటార్లు స్టార్ట్ చేసి సాగునీటిని అందిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పిన మాటలు నమ్మి రైతులు నారుమడులు పోసుకున్నారని తెలిపారు. ఇప్పుడేమో నీళ్లు ఎత్తడం లేదని పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ మాత్రం నీళ్లు ఇవ్వమని చెబుతున్నాడని అన్నారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని మండిపడ్డారు. ప్రపంచమంతా నీళ్లను కాపాడుకుంటే.. మీరు వృథా చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. పాకాల ప్రాజెక్టు కింద 29వేల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మి అక్కడి రైతులు నాట్లు వేసుకున్నారని, రామప్ప కింద కూడా నాట్లు వేసుకున్నారని పేర్కొన్నారు. రామప్ప కింద 5500 ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. నిన్న పాకాల కింద తూములు మూసేశారని పేర్కొన్నారు. నమ్మి నాట్లు వేసుకున్న రైతుల పరిస్థితి ఏంటి అని నిలదీశారు. మంత్రులది ఒక మాట.. కలెక్టర్‌ది ఒక మాట ఉంటుందా అని హరీశ్‌రావు మండిపడ్డారు. రామప్ప కింద తూములు మూసేస్తే రైతుల పరిస్థితి ఏంటని నిలదీశారు. నీళ్లు ఎత్తకుండా కలెక్టర్ ఎందుకు తూములు మూసేయమని చెప్పాడని ప్రశ్నించారు. మంత్రులు చెప్పింది తప్పయితే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. క్రాప్ హాలీడే ప్రకటించి, రైతులకు డబ్బులు ఇవ్వాలన్నారు. పంటను కాపాడుకోవడానికి రైతులు అష్టకష్టాలు పడతారని హరీశ్‌రావు తెలిపారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోసి నార్లు కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. బిందెలు, సీసాలతో పత్తికి బొట్టు బొట్టు నీళ్లు జల్లుకుంటున్నారని చెప్పారు. రైతులకు ఉన్న తపన, సోయి రేవంత్ రెడ్డికి లేదా అని మండిపడ్డారు. నీళ్ల కోసం తెలంగాణ రైతులు ఎంతో తపన పడుతున్నారని తెలిపారు. నీళ్ల ఎత్తిపోతల విషయంలో కూడా వాయిదాలు ఎందుకు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేక నీళ్లు కిందకు విడిచిపెడుతున్నాడని మండిపడ్డారు.

# ఎపిలో అరబ్ ఎమిరేట్స్ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటు

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధుల బృందం సమావేశమైంది. ఆంధ్రప్రదేశ్‌లో యూఏఈ ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో యుఏఈ ప్రతినిధుల బృందం చర్చించింది. ఈ ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు చేసిన ఆహ్వానానికి స్పందించిన యూఏఈ.. ఏపీలో ఫుడ్ క్లస్టర్ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆహార శుద్ధి రంగంలో ఏపీలో వాల్యూ చైన్ ఏర్పాటు చేయాలని యూఏఈ నిర్ణయించింది. ఈమేరకు ఏపీ ప్రభుత్వం – యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ మధ్య భాగస్వామ్యం ఏర్పాటైంది. ఈ భాగస్వామ్యంతో మామిడి, అరటి, కోకోతో పాటు వివిధ ఉద్యాన ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు పంపేలా వాల్యూ చైన్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో యూఏఈ ప్రతినిధుల బృందంతో పాటు మంత్రి టీజీ భరత్, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు, ఆంధప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తమ్మినేని సీతారాంనకు చుక్కెదురు

**అమరావతి,మన జనప్రగతి జులై 21:** మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ తమ్మినేని దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. కేసు దర్యాప్తు ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని పేర్కొన్న న్యాయ స్థానం.. ఈ దశలో జోక్యం చేసుకోవడం సరికాదని స్పష్టం చేసింది. అరెస్టు భయం ఉంటే ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సూచించింది. ఈ కేసుకు సంబంధించి కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను జులై 29కి వాయిదా వేసింది. నకిలీ పత్రాలను ఉపయోగించి సుమారు రూ.4 కోట్ల విలువైన భూమిని తన కుమారుడి పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారనే ఆరోపణలతో తమ్మినేనిపై కేసు నమోదైంది. ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో కేసును రద్దు చేయాలని కోరుతూ తమ్మినేని హైకోర్టును ఆశ్రయించారు. అయితే కేసు ప్రాథమిక దశలో ఉన్నందున క్వాష్ చేయడానికి నిరాకరించిన హైకోర్టు.. చట్టపరమైన మార్గాలను అనుసరించాలని సూచించింది.

# తమ్మినేని భూ ఆక్రమణపై చర్యలు తప్పవు

(మొదటి పేజీ తరువాయి)

చేస్తోందని మంత్రి అనగాని ధ్వజమెత్తారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సామాన్యుల ఇబ్బందులు తొలగించేవే ఆర్ఎస్కేలు అని వెల్లడించారు. ఇవి ప్రజలకు మేలు చేసేవే తప్ప ఏ ఒక్కరికీ నష్టం చేయవని స్పష్టం చేశారు. డాక్యుమెంట్ రైటర్లను పిలిపించి మాట్లాడితే వారు కూడా దీని పట్ల సానుకూలంగా స్పందించారని అన్నారు. కొందరు కొన్ని రాజకీయ పార్టీల స్వార్థం కోసం వేసే ట్రాప్‌లో పడొద్దని కోరారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా ఆర్ఎస్కేలు ఓ నూతన సాంకేతిక విధానమని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సామాన్యుల ఇబ్బందులు తొలగించేవే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల(ఆర్ఎస్‌కే)ని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. ఇవి ప్రజలకు మేలు చేసేవే తప్ప ఏ ఒక్కరికీ నష్టం చేయవని స్పష్టంచేశారు. కొన్ని రాజకీయ పార్టీల స్వార్థం కోసం వేసే ట్రాప్‌లో పడొద్దని కోరారు. రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా ఆర్ఎస్కేలు.. ఒక నూతన సాంకేతిక విధానమని తెలిపారు. గొడ్డలి పార్టీ రాజకీయ స్వలాభం కోసమే అసత్య ఆరోపణలు చేస్తోందని మంత్రి ఆరోపించారు. తమ్మినేని భూ అక్రమాలతో పాటు గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు భూమిపై చట్టవిరుద్ధంగా వ్యవహరించిన వారిపైనా చర్యలు ఉంటాయన్నారు. గత 5 ఏళ్లలో జరిగిన అన్ని అక్రమాలపై చర్యలు ఉంటాయని మంత్రి అనగాని స్పష్టం చేశారు.

# పోలవరాన్ని గాలికి వదిలేసిన జగన్

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. ఒకవైపు వెంటిలేటర్‌పై ఉన్న ఆర్థిక వ్యవస్థ .. మరోవైపు విధ్వంసమైన ఇరిగేషన్‌ను అప్పగించారంటూ వైసీపీపై విరుచుకుపడ్డారు. నేడు ఇరిగేషన్ శాఖ.. క్యాలెండర్‌ను కూడా రూపొందించుకున్నట్లు తెలిపారు. పోలవరం రాష్ట్రానికి వరం, జీవమన్నారు. 72 శాతం పోలవరాన్ని నాడే పూర్తిచేశామని.. అప్పట్లో టీడీపీ ప్రభుత్వమే కొనసాగి ఉంటే పోలవరం 2021–22 నాటికే పూర్తయ్యేదని చెప్పుకొచ్చారు. 2019లో అధికారంలో ఉన్న నాటి ప్రభుత్వం 17 నెలలు పాటు ప్రాజెక్టును గాలికి వదిలేసిందని మంత్రి విమర్శించారు.
పోలవ రం నిర్వాసితులకు ఇచ్చిన ఒక్క హామీని కూడా నాటి ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. చివరకు పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధులను కూడా మళ్లించారని ఆరోపించారు. పోలవరం రీయింబర్స్ మెంట్ సొమ్ములను కూడా నాటి ప్రభుత్వం దారి మళ్లించిందని మండిపడ్డారు. పోలవరానికి సంబంధించి ఈసీఆర్ఎఫ్ డ్యాం అత్యంత కీలమని.. డ్యాం పనులు 31 శాతం పూర్తయ్యిందని మంత్రి వెల్లడించారు. రైట్, లెఫ్ట్ కనెక్టివిటీని పూర్తిచేయడానికి రాత్రింబవళ్లు పనిచేస్తున్నారని చెప్పారు. పోలవరం నిర్వాసితులకు ఈ రెండేళ్లలోనేరూ. 2250 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రశ్నార్థకమైన ప్రాజెక్టును తిరిగి కాపాడామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు

# దేశ యువత కోసం రాహుల్ పోరాటం

**హైదరాబాద్,మన జనప్రగతి జులై 21:** యువత భవిష్యత్ కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోరాటం చేస్తున్నారని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జికి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రధాని నివాసం వద్ద ధర్నా చేపట్టారు.

ఈ ఆందోళనకు మద్దతు తెలుపుతూ సీఎం రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ మద్దతుగా నిలిచారని చెప్పారు. యంగ్ ఇండియాకు కాంగ్రెస్ అండగా ఉంటుందని సీఎం పేర్కొన్నారు.

# దిష్టిబొమ్మ దగ్ధం చేయడంతో ఏం లాభం

(మొదటి పేజీ తరువాయి)

తాను ఎక్కడా అనుచిత పదజాలం ఉపయోగించలేదని, ఎవరిపైనా వ్యక్తిగత కక్షలు లేవని స్పష్టం చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని, గతంలో పురాణాల్లో విన్న దారుణాలు ఇప్పుడు నేరుగా రోడ్లపై కనిపిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తన దిష్టిబొమ్మలు తగలబెట్టుకున్నంత మాత్రాన తనకు వచ్చే నష్టమేమీ లేదని, గడ్డి తగలబడటం తప్ప తన శరీరానికి ఏమీ కాదని వ్యాఖ్యానించారు.ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ అంటే తనకు ఎంతో గౌరవం ఉందని అంబటి తెలిపారు.
తాను అనని మాటలను అన్నట్లుగా ఆరోపించి, రాజకీయంగా దెబ్బతీయాలని చూడటం ధర్మం కాదన్నారు. హోంశాఖ మంత్రికి క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదని తేల్చిచెప్పిన ఆయన, ఒకవేళ తన వ్యాఖ్యల వల్ల మందకృష్ణ మాదిగ గారు ఏమైనా బాధపడి ఉంటే ఆయనకు క్షమాపణ చెప్పడానికి సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు.
కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకులు నేరుగా మాట్లాడకుండా, ఇతరులతో మాట్లాడించడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. హోంమంత్రి అనిత గతంలో తనపై, వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై అత్యంత దారుణంగా మాట్లాడారని గుర్తుచేస్తూ, కావాలని తనపై అనవసర వివాదాన్ని రుద్దడానికి ప్రయత్నిస్తున్నారని అంబటి రాంబాబు మండిపడ్డారు.

# 22న దివ్యాంగుల డిఈఎఫ్ ఆవిర్భావ దినోత్సవ సభను జయప్రదం చేయండి




**ఆదోని మన జనప్రగతి జులై 21:**-ఈ నెల 22 వ తేదీ న నిర్వహించే దివ్యాంగుల డిఈఎఫ్ ఆవిర్భావ దినోత్సవ సభను జయప్రదం చెయ్యాలని రాష్ట్ర దివ్యాంగుల సాధికారత ఫోరం రాష్ట్ర అధ్యక్షులు బి సి నాగరాజు, ఉపాధ్యక్షులు కమతం వెంకటేష్ లు పిలుపునిచ్చారు. మంగళవారం ఆదోని పట్టణంలో ఎంఎల్ఏ పార్థసారథిని ఆయన క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర "దివ్యాంగుల సాధికారత ఫోరం" (డిఈఎఫ్) అధ్యక్షులు బి సి నాగరాజు, ఉపాధ్యక్షులు కమతం వెంకటేష్ లు కలిసి ఈ నెల 22వ తేదీ బుధవారం ఆదోని పట్టణంలో "డిఈఎఫ్ ఆవిర్భావ దినోత్సవం" సభను "రెడ్డి జన సంఘం కమ్యూనిటీ హాల్ / రెడ్డి హాస్టల్" నిర్వహిస్తున్నట్లు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రావాలని ఆహ్వానించారు. ఇందుకు ఎంఎల్ఏ సానుకూలంగా స్పందించి తప్పకుండా వస్తానని హృదయ పూర్వక హమీ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి విశిష్ట ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల హజరు అవుతారని, కావున ఆదోని డివిజన్ పరిధిలో ఉన్న దివ్యాంగులందరూ తప్పకుండా భారిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

# మద్దికేరలో అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్

- తాగునీటి ట్యాంకుల ప్రారంభం,ప్రజాదర్బార్‌లో వినతుల స్వీకరణ





**పత్తికొండ మన జనప్రగతి జూలై 21:**-పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యామ్ కుమార్ సోమవారం మద్దికేర మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మద్దికేర టౌన్‌లోని సాయినగర్, మద్దమ్మకుంట సమీపంలో నిర్మాణం పూర్తయిన రెండు ఓహెచ్ఎస్ఆర్ తాగునీటి ట్యాంకులను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తోందని అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.అనంతరం మద్దమ్మ అవ్వకుంట వద్ద డబ్ల్యూడీసీపీఎంకేఎస్‌వై 2.0 పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. వాకింగ్ ట్రాక్, సోలార్ లైట్లు, చిన్నారుల పార్కు, ఓపెన్ జిమ్ వంటి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.తర్వాత మద్దికేర తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను వెంటనే పరిష్కరించేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

# పత్తికొండ మీదుగానే ఆదోనిఎమ్మిగనూరు ఆర్టీసీ బస్సులు నడపాలి: ఏఐవైఎఫ్ డిమాండ్




**పత్తికొండ మన జనప్రగతి జూలై 21:**-పత్తికొండలోని చదువుల రామయ్య భవనంలో అఖిల భారతీయ యువజన సమైక్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.మండల కార్యదర్శి సిద్దు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా హనుమేష్ మాట్లాడుతూ...ఆదోనిఎమ్మిగనూరు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను పత్తికొండ పట్టణంలోకి రానీయకుండా జాతీయ రహదారిపై మళ్లించడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పత్తికొండ బస్టాండ్‌కు వచ్చేలా బస్సులను నడపాలని,ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులను కోరారు.అవసరమైతే రహదారి విస్తరణ పనులు చేపట్టి పట్టణం మీదుగానే బస్సులు నడిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు, ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకుడు ములకల శివ,ఏఐవైఎఫ్ నాయకులు అల్తాఫ్, రవి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.


# శ్రీ చైతన్య నుండి ముగ్గురికి షైనింగ్ స్టార్స్ పురస్కారాలు




**అన్నమయ్య జిల్లా పేరు మన జనప్రగతి జులై 21:**-2026 సంవత్సరానికి గాను ప్రభుత్వం ప్రక టించిన షైనింగ్ స్టార్స్ (ప్రతిభ)పురస్కారాలను అన్నమయ్యజిల్లా ఇన్చార్జీ మంత్రి బిసి జనార్థన్ రెడ్డి,జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్, చేతుల మీదుగా అందుకున్న శ్రీ చైతన్య వి ద్యార్థులు రెడ్డివిష్ణుదీపక్,భవ్యశ్రీ,,జస్విత లను కడప డివిజన్ ఎ.జి.యం డి.రమణ య్య అభినందించారు.ఈ సందర్భంగా ఏర్పా టు చేసిన అభినందన సభలో ఆయన వి ద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియ జేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ శ్రీచైతన్య నుండి ముగ్గురు విద్యార్థులు ప్రతిభ పురస్కారాలకు ఎంపిక కావడం ఆన వాయితీగా మారుతుండడంవల్ల మాపై బా ధ్యత మరింత పెరుగుతుందని అన్నారు.ఈ విజయంలో విద్యార్థులకృషితోబాటు తల్లి దండ్రుల సహకారం,అధ్యాపకుల మార్గద ర్శకాలు వెలకట్టలేనివని ఆయన కొనియా డారు.ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సంచా లకులు మహబూబ్ బాషా,ప్రిన్సిపల్ కళాభా రతి, నరేంద్ర,శివార్జున్,ప్రసన్నకుమారి,వైస్ ప్రిన్సిపల్స్ జీవానందం,రాజు,ధన,రవి,రామ నాథ్, ఇన్చార్జీలు శ్రీనివాసులు,అల్లా బక్షు,సురేష్ ప్రసాద్ పాల్గొన్నారు.

# పోలీస్ శాఖలో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

- పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు 10 వేలు పెంచాలి



**కాకినాడ మన జనప్రగతి జూలై 21:**-రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించిన 11,639 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని లేని పక్షంలో నిరుద్యోగులంతా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఛలో విజయవాడ నిర్వహిస్తామని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న హెచ్చరించారు. మంగళవారం కాకినాడలో నిరుద్యోగులు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో కొండయ్యపాలెం బ్రిడ్జి జెండా సెంటర్ నుండి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట రోడ్డు పైనే బైఠాయించి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కూటమి ప్రభుత్వానికి నిరుద్యోగ యువత తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఖాళీలతో సంబంధం లేకుండా, నిరుద్యోగులతో సంబంధం లేకుండా కేవలం 2500 పోస్టులు నోటిఫికేషన్ ఇవ్వడానికి సిద్ధపడటం సిగ్గుచేటన్నారు. కనీసం పది వేల పోస్టులతో కూడిన నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గతంలో 7 సంవత్సరాలుగా నోటిఫికేషన్ లేనందున అర్హత వయస్సు 35 సం పెంచాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం గతంలో 19,999 ఖాళీలు ఉన్నాయని అసెంబ్లీలో హోంశాఖమంత్రి అనిత ప్రకటించడం జరిగిందని, కానీ 11,639 పోస్టులకు ఆర్థికశాఖ అనుమతిని బోర్డు కోరడం జరిగిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్లో జాబులే లేవన్నారు. నిరుద్యోగం రోజు రోజుకు పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు ఏమో డిగ్రీ, పిజీలు చదివిన వారికి ఒక్క ఉద్యోగం లేదని కానీ ఇంటర్ ఫేయిల్ అయినా వారు మూడు, నాలుగు శాఖలకు మంత్రులుగా ఉన్న పరిస్థితి మన రాష్ట్రంలో ఉందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యల పై ఢిల్లీ పోరాట స్ఫూర్తితో ఉద్యమిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఉపాధి ముసుగులో లక్షల ఎకరాల ప్రభుత్వ, రైతుల భూములను పెద్ద పెద్ద కార్పొరేట్లకు కారు చౌకగా కట్టబెట్టి కమిషన్లు కక్కుర్తి పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం. ఇప్పటికే అనేక జిల్లాలో ఉద్యమం ప్రారంభం అయిందని రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి పోస్టులు పెంచకపోతే ఛలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎమ్ హరేంధిర ప్రసాద్‘కు వినతి పత్రం అందజేశారు. ద

ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు టి రాజా, వాసు, సత్యం, జయరాం, ఆదర్శ కార్తిక్, రాజు, రామకృష్ణ, నిరుద్యోగ అభ్యర్థులు అంజిబాబు, ప్రదీప్, కార్తీక్, వీరేంద్ర, కృష్ణకుమారి, అమృతవల్లి, ఐశ్వర్య, నాగమణి, కర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశ్నిస్తే లాఠీఛార్జీలు, దేశద్రోహ కేసులా...?

- సిపిఐ ప్రాంతీయ కార్యదర్శి రాములు
- విద్యార్థుల ఆత్మహత్యలపై
- మంత్రి రాజీనామా చేయాలి




**వేంపల్లె మన జనప్రగతి జూలై 21:**-నీట్ ప్రశ్నా పత్రాల లీకేజీ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి ప్రశ్నిస్తే లాఠీఛార్జీలు, దేశద్రోహ కేసులా! అని సిపిఐ పులివెందుల ప్రాంతీయ కార్యదర్శి వెంకట రాములు ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ప్రశ్న పత్రాల లీకేజీతో మానసిక స్థైర్యం కోల్పోయి 20 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, దీనిపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే అవినీతి, అక్రమాలకు కేంద్రంగా మారిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్ఐటి)ని రద్దు చేసి పారదర్శకమైన పరీక్ష వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. గత కొన్ని రోజులుగా ఢిల్లీ లోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థి, ప్రజా సంఘాలు, దేశ యువత శాంతియు తంగా నిరసన చేపట్టినప్పటికీ కేంద్రం స్పందించక పోవడం అత్యంత దురదృష్టకర విషయమన్నారు. అంతేకాకుండా వీరిపై విచక్షణ రహితంగా కొట్టించడం, లాఠీఛార్జీ చేయడం దుర్మార్గమన్నారు. వీరు చట్ట పరిరక్షకులా! లేదా రౌడిమూకలా! లేదా ఆర్ఎస్ఎస్ కార్యకర్తల వీటన్నింటిపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రముఖ ఇంజనీర్, పర్యావరణ వేత్త సోనమ్ వాంగ్ చూక్ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోడీ ప్రభుత్వం కనీసం మానవత్వం కూడా చూపకపోవడం అమానుషం అన్నారు. కార్పోరేట్ దోపిడీ నుంచి విద్యను కాపాడి, ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించేలా విద్యా విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు చాంద్ బాషా, జకరయ్య, అంజనప్ప, షరీఫ్, బాదుల్లా, అలి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత నియమాల పై విద్యార్థులకు అవగాహన సదస్సు.






**కర్నూలు బ్యూరో మన జనప్రగతి జులై 21:**-కర్నూలు నగర ట్రాఫిక్ సిఐ మన్సరుద్దీన్ ఆధ్వర్యంలో స్థానిక కట్టమంచి రామ లింగారెడ్డి మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్, ఎపి యస్పి సెకండ్ బెటాలియన్ నందు రహదారి భద్రతా నియమాలపై ఏర్పాటు చేసిన సదస్సు కు ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి హాజరయ్యారు.జడ్జి మాట్లాడతూ...సమాజంలో ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలను పాటించాలని విద్యార్థులకు, స్కూల్ టీచర్లకు కోరారు. హెల్మెట్, సిటీ బెల్టు ధరించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగిన ప్రాణాలను రక్షించుకోవచ్చు అని తెలిపారు.ఓవర్ లోడు వేసుకుని వాహనం నడపరాదని తెలిపారు. ప్రతి సంవత్సరం రహదారి ప్రమాదంలో అనేకమంది ప్రాణాలను కోల్పోతున్నారని రహదారి నియమాలను పాటిస్తూ ప్రాణాలు కాపాడుకోవాలని తెలిపారు. అనంతరం కర్నూల్ ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో మైనర్లు వాహనాలు నడపరాదని తెలిపారు.అట్టి మైనర్లు కారు గాని బైకు గాని నడుపుతూ పట్టుపడితే ఆ వాహన యజమానులకు లేదా అతని తల్లిదండ్రులకు =ం. 25,000/- వేల రూపాయల జరిమానాలతో పాటు మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష పడుతుందని తెలిపారు. తాగి వాహనం నడిపితే =ం.10000/- రూపాయల జరిమానాలతో పాటు గరిష్టంగా ఆరు నెలల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు.ట్రాఫిక్ నియంత్రణ మరియు రహదారి నమూనా మోడల్ ద్వారా విద్యార్థులకు రహదారి వ్యవస్థ, ట్రాఫిక్ సిగ్నల్, జంక్షన్లు, జీబ్రా క్రాసింగ్ గురించి సవివరంగా వివరించారు.అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారు రహదారి భద్రతా నియమాలపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన స్టూడెంట్స్ కు కర్నూలు లయన్స్ క్లబ్ ఆఫ్ మెల్విన్ జోన్స్ సంస్థ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ సహకారంతో జడ్జి చేతుల మీదుగా స్టూడెంట్ లకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం రహదారి భద్రత నియమాలపై విడుదల చేసిన పోస్టర్లను జడ్జి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ మన్సురుద్దీన్ మరియు ట్రాఫిక్ ఎస్ఐ, లీగల్ ఎయిడ్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, కట్టమంచి రామలింగారెడ్డి మెమోరియల్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ హెడ్మాస్టర్ వెంకటరెడ్డి, టీచర్లు భాస్కర్ హరికృష్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

# అండర్-14 మండల స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన, ఎంపిడిఓ.విజయభాస్కర్



**బొమ్మనహాల్ మన జనప్రగతి జూలై 21:**-జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న జిల్లా స్పోర్ట్స్ ఛాంపియన్షిప్2026 అండర్-14 బాలబాలికల మండల స్థాయి క్రీడా పోటీలను మండల ఎంపిడివో విజయభాస్కర్,ఎంఈఓ మల్లికార్జున,వీరన్న,చేతుల మీదుగా ఉద్దేహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) విజయభాస్కర్ ముఖ్య అతిథిగా హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిం చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి దశ జీవితంలో అత్యంత విలువైనదని,చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లా,రాష్ట్ర,జాతీయ స్థాయిల్లో రాణించే క్రీడాకారులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.మండల విద్యాశాఖ అధికారులు యు. వీరన్న,వి.మల్లికార్జున,పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. ఆదిశేషయ్య మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దారుఢ్యాన్ని,మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని, గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించే ధైర్యాన్ని అలవర్చుతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను అధిగమించే ఆత్మవిశ్వాసాన్ని క్రీడలు కల్పిస్తాయని తెలిపారు.పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు వ్యాయామ ఉపాధ్యాయులకు భోజన ఏర్పాట్లు చేసిన సొల్లాపురం బాబును ఈ సందర్భంగా నిర్వాహకులు అభినందించారు,ఈ కార్యక్రమంలో లింగదాల్ ప్రధానోపాధ్యాయులు ఉజ్జినప్ప, ఉద్దేహాల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్ర, గ్రామ పెద్దలు నవీన్,సంగప్ప, సైకిల్ హనుమంతు, హనుమంతు, సీఆర్పీ అమరేష్, మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులు బోగేష్, కృష్ణంరాజు,శేఖర్ రెడ్డి,రూప తదితరులు పాల్గొన్నారు.మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొని కోకో,కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ఉత్సాహంగా తమ ప్రతిభను ప్రదర్శించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీల్లో విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
22- 07 - 2026

## రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జనసైనికునికి ఆర్థిక సహాయం



**చిట్వేలి మన జనప్రగతి జూలై 21:-**రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జనసేన కార్యకర్తకు చిట్వేలి మండలం జనసేన పార్టీ ఆర్థిక సహాయం అందించిందిచిట్వేలి మండలం తుమ్మకొండ గ్రామానికి చెందిన జనసైనికుడు శశి పది రోజుల క్రితం రైల్వేకోడూరు నుండి మంగంపేటకు వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్ళిపోయింది. జనసైనికుడు మృతి చెందిన విషయం తెలిసిందే. వాళ్ల కుటుంబ సభ్యులకు రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ అంత్యక్రియల ఖర్చులకు గాను 25 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. చిట్వేలి మండల జనసైనికులు దశదినకర్మ ఖర్చులకు గాను 21 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాదాసు నరసింహ, మద్దూరి మన్మధ, కంచర్ల సుధీర్ రెడ్డి, మలిశెట్టి రమేష్, మహంకాళి నాగేంద్ర, మాదినేని రాజా, పవన్ రాజు పాల్గొన్నారు.

## కోవిడ్‌పై ఆందోళన వద్దు..

### - వ్యాక్సిన్ తీసుకున్నవారు ఆరోగ్యంగా ఉంటారు: డా.ప్రసన్నకుమార్



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 21:-**కోవిడ్‌పై ప్రజలు అనవసర ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అందించిన కోవిడ్ వ్యాక్సిన్ తీసుకున్నవారు ఆరోగ్యంగా ఉంటారని సిద్ధవటం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆయుష్ వైద్యంలో అనేక వ్యాధులకు సమర్థవంతమైన చికిత్సలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అవసరమైన సందర్భాల్లో మాస్కు ధరించాలని సూచించారు. కోవిడ్‌పై అపోహలకు తావివ్వకుండా అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## జలుబు,దగ్గును నిర్లక్ష్యం చేయొద్దు..

### - వెంటనే వైద్యులను సంప్రదించండి: డా.చిరంజీవి రెడ్డి



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 21:-**జలుబు, దగ్గు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సిద్ధవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ చిరంజీవి రెడ్డి సూచించారు. మంగళవారం ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి చల్లార్చిన తాగునీటిని మాత్రమే వినియోగించాలని సూచించారు. జలుబు, దగ్గు లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలని చెప్పారు. కోవిడ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రిలో ప్రత్యేక వార్డును ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రజలు అపోహలకు తావివ్వకుండా అప్రమత్తంగా ఉంటూ ఆరోగ్య నియమాలు పాటించాలని సూచించారు.

## వాహనదారులకు ప్రమాదకరంగా మారిన కంపచెట్లు



**పులివెందుల టౌన్ మన జనప్రగతి జూలై 21:-** పట్టణంలోని మార్కెట్ యార్డ్ నుంచి పెట్రోల్ బంక్ వరకు ఉన్న ప్రధాన రహదారి మధ్య డివైడర్లలో నాటిన పూల మొక్కల మధ్య గత కొంతకాలంగా కంపచెట్లు విపరీతంగా పెరిగాయి. ఈ కంపచెట్లు రోడ్డుపైకి విస్తరించి ఉండటంతో వాహనదారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. అదేవిధంగా, ఈ మార్గంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన వీధి దీపాలు కూడా వెలగకపోవడంతో రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రయాణించే సమయంలో కంపచెట్ల కొమ్మలు ముఖాలకు, కళ్లకు తగిలే ప్రమాదం ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజూ ఈ రహదారిపై వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో, డివైడర్లలో పెరిగిన కంపచెట్లను వెంటనే తొలగించి, పనిచేయని వీధి దీపాలను మరమ్మతు చేసి వెలిగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## జాస్ నేతలను కలిసిన ఐ అండ్ పిఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్

- అక్రిడేషన్లు,హెల్త్ కార్డులు, ఫీజు రాయితీ అంశాలపై వినతి



**కడప మన జనప్రగతి జూలై 21:-** కడప జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ (ఐ అండ్ పిఆర్) అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఏ. రమేష్‌ను జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇండియా (జాస్) నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జాస్ నాయకులు గుండ్రాతి విజయకుమార్, ఎన్.వి. సుబ్బారెడ్డి, ఎస్.వి. రమణ ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో జర్నలిస్టులకు మూడో విడత అక్రిడేషన్లను త్వరితగతిన మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే అక్రిడేషన్ పొందిన పలువురు జర్నలిస్టులు ఇంకా హెల్త్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోలేదని, వారందరికీ అవగాహన కల్పించి దరఖాస్తులు పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా జర్నలిస్టుల పిల్లలకు ప్రభుత్వం కల్పిస్తున్న 50 శాతం ఫీజు రాయితీని కొన్ని విద్యాసంస్థలు అమలు చేయడం లేదని, ఈ అంశంపై కూడా సంబంధిత యాజమాన్యాలతో సమన్వయం చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జాస్ ప్రతినిధులు ఏడి దృష్టికి తీసుకెళ్లారు.వారి వినతులపై అసిస్టెంట్ డైరెక్టర్ ఏ. రమేష్ సానుకూలంగా స్పందిస్తూ, జర్నలిస్టుల సంక్షేమానికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ భేటీ స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది.

## స్టాంప్ రైటర్లను రోడ్డున పడేస్తే ఊరుకోం.. ఖబడ్దార్ చంద్రబాబు: మాజీ ఎమ్మెల్యే రాచమల్లు

- ప్రొద్దుటూరులో స్టాంప్ రైటర్ల దీక్షకు వైఎస్సార్‌సీపీ మద్దత
- జీఓ 396 రద్దు చేయాలని డిమాండ్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 21:-**రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల పేరుతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ స్టాంప్ రైటర్లు చేపట్టిన నిరవధిక దీక్షకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నెం.396 వల్ల స్టాంప్ రైటర్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం తాను ఎప్పుడూ ముందుంటానని పేర్కొన్న రాచమల్లు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు మేలు చేసే ఉద్దేశంతో వేలాది మంది స్టాంప్ రైటర్లను రోడ్డున పడేస్తే వైఎస్సార్‌సీపీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు.ప్రజలందరూ ప్రభుత్వ విధానాలను గమనిస్తున్నారని అన్నారు.ప్రైవేటీకరణ కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం గణనీయంగా తగ్గుతుందని పేర్కొంటూ, సుమారు రూ.60 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉన్న చోట కేవలం రూ.4 కోట్లకే పరిమితమవడం "సంపద సృష్టి" ఎలా అవుతుందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రశ్నించారు.జీఓ నెం.396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసిన ఆయన, ఈ నెల 31వ తేదీలోపు ప్రభుత్వం నిర్ణయం మార్చుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 వేల మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో కలిసి వంటావార్పు వంటి ప్రజాస్వామ్య నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో స్టాంప్ రైటర్స్ అసోసియేషన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లపాలెం అండర్ బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

### అధికారులకు మంత్రి కందుల దుర్గేష్ ఆదేశం

### స్వయంగా తాళ్లపాలెం వెళ్లి అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిలిచిన ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించిన మంత్రి దుర్గేష్



**నిడదవోలు మన జనప్రగతి జూలై 21:-** నాలుగు రోజుల రాజస్థాన్, న్యూఢిల్లీ పర్యటనలను దిగ్విజయంగా ముగించుకుని నిడదవోలు క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ నియోజకవర్గ సమస్యలపై వెంటనే సమీక్ష చేపట్టారు.గత కొన్ని రోజులుగా తాళ్లపాలెం అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిపోతున్న వర్షపు నీటి సమస్యపై సంబంధిత అధికారులతో మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్షపు నీటిని వెంటనే బయటకు తోడేసేందుకు అవసరమైన మోటార్లను వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. పరిసర ప్రాంతాల చేలు, కాలువల నుండి నీరు బ్రిడ్జిలోకి చేరకుండా పటిష్టమైన చర్యలు చేపట్టడంతో పాటు, నీరు సజావుగా బయటకు వెళ్లేలా పైప్‌లైన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ స్వయంగా తాళ్లపాలెం వెళ్లి వంతెన క్రింద నిలిచిన నీరును పరిశీలించారు. తక్షణమే నీటిని తొలగించాలని తాడేపల్లిగూడెం వెళ్లే మార్గంలో ప్రయాణికులు, వాహనదారులకు రాకపోకల ఇబ్బందులు లేకుండా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి ఆదేశించారు. మంత్రి దుర్గేష్ సత్వర స్పందనపై స్థానిక ప్రజానీకం హర్షం వ్యక్తం చేశారు. ఇటీవలే ముంబయి పర్యటనలో ఉన్న సమయంలో కూడా మంత్రి దుర్గేష్ వీడియో కాల్ ద్వారా స్పందించి, జిల్లా అధికార యంత్రాంగంతో పాటు కూటమి నాయకులను క్షేత్రస్థాయి పరిశీలనకు పంపిన విషయం విదితమే. రాబోయే రోజుల్లో రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన స్పష్టంగా ఆదేశించారు.ఈ అత్యవసర సమీక్షా సమావేశంలో ఎంపీడీవో, జలవనరుల శాఖ ఏఈ , రైల్వే, ఆర్ అండ్ బీ అధికారులు మరియు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డుల్లో మెరిసిన విస్డమ్ విద్యార్థులు



**రైల్వేకోడూరు మన జన ప్రగతి, జూలై 21:** రైల్వే కోడూరు పట్టణం పాతబజార్‌లోని విస్డమ్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌కు చెందిన విద్యార్థులు వై. మహేందర్, డి. జాహ్నవి కుమారి ఎస్ఎస్‌సీ2026 ఫలితాల్లో మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి తిరుపతి జిల్లా షైనింగ్ స్టార్ ప్రతిభ అవార్డుకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా జూలై 20న తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్, పతకం (మెడల్)తో పాటు రూ.20 వేల నగదు చెక్కును అందజేశారు.ఈ విషయాన్ని విస్డమ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టి. ప్రదీప్ తెలిపారు. అలాగే పాఠశాల విద్యార్థి వై. మహేందర్ ఒంగోలు ట్రిపుల్ ఐటీ లో ప్రవేశానికి ఎంపిక కావడం సంస్థకు మరో గర్వకారణమని పేర్కొన్నారు.అవార్డు గ్రహీతలను అభినందించిన కార్యక్రమంలో విస్డమ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టి. ప్రదీప్, అడ్మిన్ డైరెక్టర్ మదన్‌మోహన్, ప్రిన్సిపల్ టి. ప్రియాంక, అకాడమిక్ ఇన్‌చార్జి ముఖేష్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## మహిళల భద్రతపై అవగాహన సదస్సు



**రైల్వే కోడూరు మన జనప్రగతి, జూలై 21:-**రైల్వే కోడూరు మండలంలో మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, మత్తు పదార్థాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రైల్వే కోడూరు మండల రెవెన్యూ అధికారి కార్యాలయ ఆవరణలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు.తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసులు పర్యవేక్షణలో రైల్వే కోడూరు టౌన్ సీఐ సి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళలు వేధింపులు, గృహహింస, లైంగిక వేధింపులు లేదా ఇతర నేరాలకు గురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. ప్రతి మహిళ తన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, చట్టం మహిళలకు సంపూర్ణ రక్షణ కల్పిస్తుందని పేర్కొన్నారు.సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో అపరిచితులు పంపే లింకులు తెరవడం, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్‌లు, పాస్‌వర్డ్లు ఇతరులకు తెలియజేయడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, వ్యక్తిగత వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు.యువత గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల అక్రమ రవాణా లేదా విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. మహిళలు ప్రయాణాల సమయంలో భద్రతా జాగ్రత్తలు పాటించాలని, రాత్రి వేళల్లో కుటుంబ సభ్యులకు ప్రయాణ వివరాలు తెలియజేయడం, వాహన నంబర్ నమోదు చేసుకోవడం, అవసరమైతే లైవ్ లొకేషన్ షేర్ చేయడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అత్యవసర పరిస్థితుల్లో 112 పోలీస్ ఎమర్జెన్సీ సేవలు, 181 మహిళల హెల్ప్‌లైన్, 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930కు ఫిర్యాదు చేస్తే ఆర్థిక నష్టాన్ని నివారించే అవకాశం ఉంటుందని వివరించారు. మండల రెవెన్యూ అధికారి అమర్నాథ్, ఏపీఎం (వెలుగు) వసుందర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలాదేవి, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యురాలు డాక్టర్ సంధ్య, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరులో ఐద్వా ధర్నా..!

- గంజాయి, మద్యం నియంత్రించాలి..
- అధిక ధరల విక్రయాలపై చర్యలు తీసుకోవాలి:ఐద్వా





**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 21:-**గంజాయి,మద్యం విక్రయాలను అరికట్టడంతో పాటు మద్యం దుకాణాల్లో అధిక ధరలకు విక్రయాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో మంగళవారం రాజీవ్ సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం,జిల్లా అధ్యక్షురాలు ఐ.ఎన్.సుబ్బమ్మ మాట్లాడుతూ...ఉదయం 11 గంటలకు తెరవాల్సిన మద్యం దుకాణాలు తెల్లవారుజామున 5 గంటల నుంచే తెరుచుకుని అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నా ఎక్సైజ్, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.మద్యం,డ్రగ్స్‌కు యువత బానిసలవడంతో కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని, వారాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు పెరిగి అనేక కుటుంబాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి జి. ప్రేమ, పట్టణ అధ్యక్షురాలు వై. విజయమ్మ మాట్లాడుతూ..మద్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. గంజాయి నిర్మూలన, అధిక ధరలకు మద్యం విక్రయాల నియంత్రణలో ఎక్సైజ్ శాఖ విఫలమైందని విమర్శించారు.దేవాలయాలు,పాఠశాలల సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారని, ఎన్నికల ముందు బెల్ట్ షాపులను తొలగిస్తామని, మహిళలకు భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని అన్నారు.మద్యం,గంజాయి నియంత్రణలో ప్రభుత్వం విఫలమైతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఐద్వా నాయకులు కే. సర్వేశ్వరి, పుష్పలత, జే. భానుమతి, డి. వెంకట సుబ్బమ్మ, ఎం.గురమ్మ, వై. సుదర్శనమ్మ, ఎం.లక్ష్మీదేవి,కే. లావణ్య, శాంతి, చెన్నమ్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, యూనియన్ నాయకుడు సురేష్ పాల్గొని మద్దతు తెలిపారు. పెద్ద సంఖ్యలో మహిళలు ధర్నాలో పాల్గొన్నారు.

# ఆదర్శ ఉపాధ్యాయినిగా ఎనుముల జయమ్మకు ఘన సన్మానం

**● 36 ఏళ్ల విద్యాసేవలకు ఘన నివాళి..**

**పదవీ విరమణ వేడుకలో భావోద్వేగ క్షణాలు**



**వనపర్తి మన జనప్రగతి జూలై 20:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా విద్యారంగంలో మూడు దశాబ్దాలకు పైగా విశిష్ట సేవలందించిన ఆదర్శ ఉపాధ్యాయిని ఎనుముల జయమ్మ సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణంలోని దక్ష లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో ఆమెకు ఘనంగా సన్మానోత్సవాన్ని నిర్వహించారు. 1989లో స్పెషల్ టీచర్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన జయమ్మ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 36 సంవత్సరాల పాటు సేవలందించారు. అనంతరం ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయినిగా బాధ్యతలు నిర్వహించి విశిష్ట సేవల అనంతరం పదవీ విరమణ పొందారు. వీడ్కోలు సభలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా జయమ్మ స్వయంగా పలు గీతాలను ఆలపించి సభికులను అలరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కొత్తకోట మండల విద్యాశాఖ అధికారి జే. కృష్ణయ్య మాట్లాడుతూ, జయమ్మ తన ఉద్యోగ జీవితమంతా విద్యార్థుల అభ్యున్నతి కోసం అంకితభావంతో పనిచేశారని కొనియాడారు. జయమ్మ మాట్లాడుతూ, తన ఉద్యోగ జీవితంలో సహకరించిన అధికారులు, సహచరులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల ప్రేమాభిమానాలే తనకు గొప్ప సంపద అని పేర్కొన్నారు. అనంతరం జయమ్మ, ఆమె భర్త టి. సుదర్శన్ రెడ్డి దంపతులను శాలువాలు కప్పి, పూలహారాలు వేసి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు టి. వివేకానంద, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, సహచర ఉపాధ్యాయులు, శిష్యులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య నుండి ముగ్గురికి షైనింగ్ స్టార్స్ పురస్కారాలు




**అన్నమయ్య బ్యూరో మన జనప్రగతి జూలై 21:-** 2026 సంవత్సరానికి గాను ప్రభుత్వం ప్రక టించిన షైనింగ్ స్టార్స్ (ప్రతిభ)పురస్కారా లను అన్నమయ్యజిల్లా ఇన్చార్జ్ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి,జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్, చేతుల మీదుగా అందుకున్న శ్రీ చైతన్య వి ద్యార్థులు రెడ్డివిష్ణుదీపక్,భవ్యశ్రీ,,జస్విత లను కడప డివిజన్ ఎ.జి.యం డి.రమణ య్య అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పా టు చేసిన అభినందన సభలో ఆయన వి ద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియ జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ శ్రీచైతన్య నుండి ముగ్గురు విద్యార్థులు ప్రతిభ పురస్కారాలకు ఎంపిక కావడం ఆన వాయితీగా మారుతుండడంవల్ల మాపై బా ధ్యత మరింత పెరుగుతుందని అన్నారు. ఈ విజయంలో విద్యార్థులకృషితోబాటు తల్లి దండ్రుల సహకారం,అధ్యాపకుల మార్గద ర్శకాలు వెలకట్టలేనివని ఆయన కొనియా డారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సంచా లకులు మహబూబ్ బాషా,ప్రిన్సిపల్ కళాభా రతి, నరేంద్ర,శివార్జున్,ప్రసన్నకుమారి,వైస్ ప్రిన్సిపల్స్ జీవానందం,రాజు,ధన,రవి,రామ నాథ్, ఇన్చార్జీలు శ్రీనివాసులు,అల్లా బక్షు,సురేష్ ప్రసాద్ పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ పర్యాటకానికి బెస్ట్ వెడ్డింగ్ డెస్టినేషన్ ఎమర్జింగ్ స్టేట్ అవార్డు

**● ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్ క్లేవ్ (ఐడబ్ల్యూటీసీ) వేదికగా జైపూర్ లో అవార్డు అందుకున్న మంత్రి కందుల దుర్గేష్ ● డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దుతామని వెల్లడి**




**రాజస్థాన్ మన జనప్రగతి జూలై 21:-** రాజస్థాన్ లోని జైపూర్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ వెడ్డింగ్ అండ్ టూరిజం కాన్ క్లేవ్ (IWTC) లో ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి మరో అరుదైన గౌరవం దక్కింది. పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను డెస్టినేషన్ వెడ్డింగ్స్ కు ప్రత్యేక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు, ఈ రంగంలో కార్యక్రమాలను అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలకు గాను ఏపీకి బెస్ట్ వెడ్డింగ్ డెస్టినేషన్ ఎమర్జింగ్ స్టేట్ అవార్డు పురస్కారం లభించింది. ఈ ప్రతిష్టాత్మక అవార్డును రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ సోమవారం రాత్రి జైపూర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో నిర్వాహకుల చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ..కేంద్ర సహకారంతో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని ఏపీ సర్కార్ పర్యాటకాభివృద్ధి కోసం చేస్తున్న కృషికి ఈ అవార్డు నిదర్శనమని హర్షం వ్యక్తం చేశారు. "దేశీయ, అంతర్జాతీయ వివాహ వేడుకలకు ఏపీయే ఫేవరెట్ స్పాట్ గా ఉండేలా చేస్తామన్నారు. అందమైన లోకేషన్లు.. అద్భుతమైన ఆతిథ్యం తో పాటు రాబోయే రోజుల్లో ఏపీని డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలే కేరళలో గ్లోబల్ ట్రావెల్ మార్కెట్ అందించిన బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్ అవార్డు మరియు గోవాలో ఇండియన్ రూట్స్ ఎడిటర్స్ ఛాయిస్ విభాగంలో అరకు కు మోస్ట్ ఇన్ స్టాగ్రామబుల్ ల్యాండ్ స్కేప్ అవార్డును అందుకున్నామని, ఇప్పుడు మరో అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని మంత్రి దుర్గేష్ అన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

# బాలికల విద్య, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి: సీడీపీవో సుగుణ



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 21:-** కడప ఐసీడీఎస్ అర్బన్ ఇన్‌చార్జి సీడీపీవో సుగుణ ఆధ్వర్యంలో మంగళవారం సిద్ధవటం ఎగువపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 'బేటీ బచావోబేటీ పడావో' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ, బాలికలను విద్యావంతులను చేయడం ద్వారా కుటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. బాలికలపై వివక్షను నిర్మూలించి, వారికి విద్య, ఆరోగ్యం, భద్రతలో సమాన అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, బాలికల అక్రమ రవాణా, మధ్యలోనే చదువు మానివేయడం వంటి సమస్యలు ఎదురైతే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్1098కు సమాచారం అందించాలని సూచించారు. తల్లిదండ్రులు బాలికల చదువుకు ప్రోత్సాహం అందించి, వారి సాధికారతకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సునీత, అంగన్‌వాడీ సూపర్వైజర్లు శ్రీవిద్య, దీప, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలి..

**- పరిసరాల పరిశుభ్రతే రక్షణ:వైద్య సిబ్బంది**



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 21:-** డెంగ్యూ వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా సిద్ధవటం మండలం వెలుగుపల్లి గ్రామంలో మంగళవారం పి.కొత్తపల్లి వైద్యాధికారి డాక్టర్ మురళీమోహన్ ఆధ్వర్యంలో డెంగ్యూపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డెంగ్యూ జ్వరంపై అపోహలకు తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులను నివారించడంలో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత కీలకమని తెలిపారు. జ్వరం లేదా ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే సమీప ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ లోకేశ్వరి, ఆరోగ్య కార్యకర్త ఆదిలక్ష్మిదేవి, ఆశా వర్కర్లు భారతి, పద్మ, కళావతి, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం


**- ప్రజా దర్బార్‌లో వినతులు స్వీకరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



**అన్నమయ్య బ్యూరో మన జనప్రగతి జూలై 21:-** రాయచోటి పట్టణంలోని ఎస్.ఎన్. కాలనీలో ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన & క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోమవారం ప్రజా దర్బార్ నిర్వహించి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా ఆలకించారు. ఈ సందర్భంగా ప్రజలు వ్యక్తిగత, సామాజిక, గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులకు సంబంధించిన పలు వినతులను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించిన మంత్రి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ప్రజల విశ్వాసానికి అనుగుణంగా పారదర్శక పాలన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ప్రజా దర్బార్‌లో నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 17 ఏళ్ల బాలుడు మిస్సింగ్ కేసు

**- 24 గంటల్లో తల్లిదండ్రుల చెంతకు చేర్చిన గాలివీడు ఎస్సై**



రాత్రి 11 గంటల సమయంలో సీసీటీవీ పరిశీలిస్తున్న ఎస్ఐ నరసింహారెడ్డి

**గాలివీడు మన జన జనప్రగతి జులై 21:-** కేసు నమోదైన 24 గంటలలోపే బాలుడి ఆచూకీ కనిపెట్టి తల్లిదండ్రులకు అప్పగించిన గాలివీడు ఎస్ ఐ నరసింహ రెడ్డి. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం బురుజుపల్లికి చెందిన చంద్రగిరి గణేష్ (17) సోమవారం ఇంటి నుండి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు గాలివీడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే గాలివీడు ఎస్ఐ నరసింహారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తును అత్యంత వేగంగా ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా గాలివీడు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి బాలుడి కదలికలను గుర్తించారు. ఈ క్రమంలో గణేష్ గాలివీడు నుండి తిరుమలకు వెళ్లినట్లు నిర్ధారించిన పోలీసులు వెంటనే అప్రమత్తమై అక్కడికి చేరుకుని బాలుడిని సురక్షితంగా స్వాధీనం చేసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరసింహారెడ్డి మాట్లాడుతూ, పిల్లలపై తల్లిదండ్రులు నిరంతరం శ్రద్ధ వహించాలని, ఏవైనా సమస్యలు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కేసు నమోదైన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా స్పందించి, సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలను సమర్థంగా వినియోగించి కేవలం 24 గంటల్లోనే బాలుడి ఆచూకీని గుర్తించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన గాలివీడు ఎస్ఐ నరసింహారెడ్డి, పోలీసు సిబ్బంది పనితీరును స్థానికులు అభినందిస్తున్నారు. సమయస్ఫూర్తి, నిబద్ధత, ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేస్తున్న గాలివీడు ఎస్ ఐ నరసింహ రెడ్డి ని మండల ప్రజలు అభినందిస్తున్నారు.

# రైతులు ఈ - పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి




**చిట్వేలి మన జనప్రగతి జూలై 21:-** ప్రతి రైతు ఈ - పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని రైల్వే కోడూరు వ్యవసాయ సహాయ సంచాలకులు మణి సూచించారు. చిట్వేలి మండలం తిమ్మయ్య గారిపల్లి, సి.కందులవారి పల్లెల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకులు మణి మాట్లాడుతూ ఈ - పంట నమోదు చేసుకుంటేనే యూరియా, డిఏపీ ఎరువులు ఇవ్వడం జరుగుతుందన్నారు. వరి, వేరుశనగ, అరటి, పంటలు వేసిన వారు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేసుకోవాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు రైతులు నష్టపోకుండా ఇన్సూరెన్స్ వస్తుందని సూచించారు. ప్రతి పంట లోనూ అవసరం మేరకు యూరియా వాడితే చీడపీడలను నివారించవచ్చు అన్నారు. రసాయన ఎరువులకు బదులుగా పచ్చిరొట్ట ఎరువులు జనము, జీలుగ, జీవన ఎరువులు, ప్రకృతి వ్యవసాయం పద్ధతులైన జీవామృతం వాడడం వలన భూ ఆరోగ్యం కాపాడుతూ మంచి దిగుబడి పొందవచ్చని సహాయ వ్యసాయ సంచాలకులు మణి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సుధాకర్, గ్రామ వ్యవసాయ సహాయకులు శివసాయి కళ్యాణ్, రైతులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**- ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 21:-** నీట్ పరిక్ష పత్రాల లీకేజీ, పరిక్ష రద్దుకు సంబంధించి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఏపిసిసి మీడియా ఛైర్మన్ డా.తులసిరెడ్డి సూచించారు. గతంలో ఆయా మంత్రిత్వ శాఖల్లో జరిగిన ప్రమాదాలు, అవినీతి ఆరోపణలు, వైఫల్యాలకు నైతిక బాధ్యత వహిస్తూ అనేక మంది కేంద్ర మంత్రులు రాజీనామా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. 1956లో లాల్ బహదూర్ శాస్త్రి, 1958లో టిటి కృష్ణమాచారి, 1962లో వికె కృష్ణ మినన్, 1987లో విపి సింగ్, 2008లో శివరాజ్ పాటిల్, 2013లో పవన్ బన్సాల్, అశ్విని కుమార్, 2021లో హర్షవర్ధన్ లు తమ పదవులపై నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారన్నారు. అదేతరహా నీట్ పరిక్ష లీకేజీ, పరిక్ష రద్దుకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, లేదంటే ప్రధానమంత్రి మోడీ, ధర్మేంద్ర ప్రధాన్ ని తొలగించాలని డిమాండ్ చేశారు.

# పిజిఆర్ఎస్ పై క్యూఆర్ కోడ్ సద్వినియోగం చేసుకోవాలి

**- ఎంపిడిఓ కుళాయమ్మ**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 21:-** ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ(పిజిఆర్ఎస్)పై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ కుళాయమ్మ సూచించారు. పిజిఆర్ఎస్ సేవలపై ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వం ఈ డిజిటల్ వ్యవస్థను ఫిర్యాదుల పరిష్కార నాణ్యతను పెంచేందుకు, పారదర్శకత తీసుకు వచ్చేందుకు క్యూఆర్ కోడ్ విధానం ఉపయోగపడుతుందని వెల్లడించారు. పిజిఆర్ఎస్ సేవలు పొందిన ప్రజలు తమ మొబైల్ ఫోన్ లతో క్యూఆర్ కోడ్ ని స్కాన్ చేసి సేవలపై అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కోరారు.

## మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసిన నిడదవోలు దస్తావేజుల లేఖర్ల సంఘం ప్రతినిధులు

**● సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి దుర్గేష్ హామీ..దుష్ప్రచారాలు నమ్మవద్దని హితవు**



**నిడదవోలు మన జనప్రగతి జూలై 21:-** ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలు అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం మంత్రి కందుల దుర్గేష్ ను నిడదవోలు దస్తావేజుల లేఖర్ల సంఘం ప్రతినిధులు కలిసి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నంబర్ 396ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా తాము లేఖర్ల వృత్తిలో ఉన్నామని, ప్రజల ఆస్తులకు సంబంధించి, క్రయ విక్రయాలకు సంబంధించి ఎంతో సేవలు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో వల్ల తమకు, డీటీపీ ఆపరేటర్ల మనుగడకు ప్రమాదం ఏర్పడే అవకాశమున్న నేపథ్యంలో తాము పెన్ డౌన్ కార్యక్రమం చేస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో లేఖర్ల విజ్ఞప్తి మేరకు ఈ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని,కొందరు చేసే దుష్ప్రచారాలను నమ్మవద్దని మంత్రి దుర్గేష్ వారికి తెలిపారు.

## పులివెందులలో ప్రత్యేక వాహన తనిఖీలు

**● నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఈ-చలాన్లు**



**పులివెందుల,మన జనప్రగతి జూలై 21 :-** జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు, పులివెందుల డీఎస్పీ మురళి పర్యవేక్షణలో ఎస్ఐ తిమోతి తన సిబ్బందితో కలిసి పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల సమీపంలో మంగళవారం ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ తదితర పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు మోటారు వాహన చట్టం ప్రకారం ఈ-చలాన్లు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిమోతి మాట్లాడుతూ, వాహనదారుల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు. నాలుగు చక్రాల వాహనాల్లో సీటుబెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను వెంట ఉంచుకోవాలని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ వినియోగించడం, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు వెల్లడించారు.

## తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలి

**● కరస్పాండెంట్ బండ్రెడ్డి చక్రపాణి రెడ్డి**

**● షైనింగ్ స్టార్స్ అవార్డులను అందుకున్న శ్రీచైతన్య విద్యార్థినీలు**



**వేంపల్లె మన జనప్రగతి జూలై 21:-**తల్లిదండ్రుల కలలను నెరవేర్చుతూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తూ జీవితంలో ఉన్నతమైన స్థాయికి ఎదగాలని శ్రీచైతన్య ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ బండ్రెడ్డి చక్రపాణి రెడ్డి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న షైనింగ్ స్టార్స్ అవార్డులను పాఠశాలకు చెందిన విద్యార్థినిలు జూటూరు రజిత, కె.షైని రోషిణి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ చేతుల మీదుగా అందుకున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి పదోతరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విజేతలకు మెడల్స్, ప్రశంస పత్రాలు, రూ.20 వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, డిఇఒ షంషుద్దీన్, తదితర అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే కరస్పాండెంట్ చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థినిలు ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చూపి అవార్డులను పొందడం పాఠశాలకు గర్వకారణం అన్నారు. మరిన్ని విజయాలు సొంతం చేసుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. అంతేకాకుండా పాఠశాల డైరెక్టర్ చేతన్ రెడ్డి, చైతన్యరెడ్డి, ఉపాధ్యాయుల బృందం హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినిలను అభినందించారు.

## అమరావతి ఛాంపియన్స్ క్రీడలకు యువత ముందుకు రావాలి

**● ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ పిలుపు**



**పత్తికొండ మన జనప్రగతి జూలై 21:-**ఈ నెల 28, 29 తేదీల్లో పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న అమరావతి ఛాంపియన్స్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పోటీలను విజయవంతం చేయాలని పత్తికొండ శాసనసభ్యులు కేఈ శ్యాం కుమార్ పిలుపునిచ్చారు. పత్తికొండ నియోజకవర్గానికి చెందిన 17 ఏళ్ల లోపు, 23 ఏళ్ల లోపు బాలబాలికలు అమరావతి ఛాంపియన్స్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న క్రీడాకారులకు మాత్రమే పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పత్తికొండ క్రీడా డివిజన్ కోఆర్డినేటర్ చందు నాయక్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు పాండురంగరాజు, సంజప్ప, వేణుగోపాల్, రంగస్వామి, మధుసూదన్ నాయుడు, స్టేడియం కోచ్ ధనుంజయ్, రాము తదితరులు పాల్గొన్నారు.

## తనపై చేసిన ఆరోపణలు నిరాధారం: గంగిరెడ్డి వెంకటనాథరెడ్డి



**కడప మన జనప్రగతి జూలై 21:-**తనపై చేసిన భూ కబ్జా ఆరోపణలు పూర్తిగా నిరాధారమని గంగిరెడ్డి వెంకటనాథరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం కోఆపరేటివ్ కాలనీలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత గ్రీవెన్స్ కార్యక్రమంలో అంజద్‌బాష తనపై దేవాదాయశాఖ భూమిని ఆక్రమించారని చేసిన ఫిర్యాదు వాస్తవాలకు విరుద్ధమని పేర్కొన్నారు. తన భూమికి సంబంధించి 1918 సంవత్సరం నుంచి అన్ని చట్టబద్ధమైన పత్రాలు ఉన్నాయని, అలాంటప్పుడు కబ్జా చేశానని ఆరోపించడం సమంజసం కాదని ప్రశ్నించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఇతరులు చెప్పిన సమాచారంతో ఆరోపణలు చేయడం తగదన్నారు. అలాగే, వైసీపీ ప్రభుత్వ హయాంలో డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న అంజద్‌బాషే సర్వే నంబర్ 384లో వంకపోరంబోకు భూమిని ఆక్రమించి భవనం నిర్మించి, దానిని కారు షోరూంకు అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్న విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. కార్పొరేషన్ అధికారులను తప్పుదోవ పట్టించి బ్యాంకు రుణం పొందిన అంశంపైనా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. వైసీపీ పాలనలో జరిగిన భూ ఆక్రమణలు, అక్రమాలపై అంజద్‌బాష విచారణను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారా అని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కడపకు వచ్చిన సమయంలో తనను చూపించి ఓట్లు అడిగిన విషయాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని, అవసరమైతే ఈ అంశంపై చట్టపరంగా పోరాటం చేస్తామని గంగిరెడ్డి వెంకటనాథరెడ్డి తెలిపారు. తన భూమికి సంబంధించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## శ్రీ సత్యసాయి జిల్లా గణేష్ ఉత్సవ సమితి నూతన కమిటీ ఎన్నిక



**ధర్మవరం,మన జనప్రగతి జూలై 21:-** శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయ ప్రాంగణంలో శ్రీ గణేష్ ఉత్సవ సమితి సమావేశం ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి ప్రముఖులు పాల్గొన్న ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి గోరంట్ల రమణ ముఖ్య అతిథిగా హాజరై నూతన జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ వివేక్ కుల్లాయప్ప (ధర్మవరం), జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరేంద్ర కుమార్ (పరిగి), జిల్లా ఉపాధ్యక్షుడిగా నచ్చు బాలకృష్ణ యాదవ్ (కదిరి) ఎన్నికయ్యారు. అలాగే జిల్లా సహ కార్యదర్శులుగా బిల్లే రవీంద్ర (ధర్మవరం), కురాకుల సోమశేఖర్ (పరిగి), ఆనంద్ (కదిరి), కృష్ణ నాయక్ (పుట్టపర్తి), కోశాధికారిగా ఎర్రజోడు చంద్ర (ధర్మవరం) ఎన్నికయ్యారు. సభ్యులుగా సూర్యనారాయణ, ప్రసాద్ (ముదిగుబ్బ), నాగరాజు (హిందూపురం), మిట్ట రామాంజనేయులు (రొద్దం), మంజు (హిందూపురం), కాంబ్లే లక్ష్మణ్ (ధర్మవరం)లను నియమించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు హిందూ ధర్మ పరిరక్షణతో పాటు గణేష్ ఉత్సవాలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ విజయమే ధ్యేయం

**● మీ సంకల్పానికి, నాయకత్వానికి అండగా ఉంటాం**

**● వైకాపా నాయకులు కడియాల లక్ష్మీనారాయణ**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 21:-**వైసీపీ గెలుపును లక్ష్యంగా చేసుకుని పనిచేయాలనే మీ సంకల్పానికి అనుగుణంగా, స్థానిక నాయకత్వం మరియు క్యాడర్ సమన్వయంతో ప్రజల్లోకి వెళ్లడం ఎంతో ముఖ్యం అని,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఒక సైనికుడిలా పని చేస్తానని జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి తో వైకాపా నాయకులు కడియాల లక్ష్మి నారాయణ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి నివాసంలో కడియాల లక్ష్మి నారాయణ తోటి వైసిపి నాయకులతో మర్యాదపూర్వకంగా కలవగా ఎంపీ అవినాష్ రెడ్డి ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డితో లక్ష్మి నారాయణ మాట్లాడుతూ 109 వ బూత్ కి సంబంధించిన ఓటింగ్ పర్సంటేజ్ 86.10% పూర్తి అయ్యిందని తెలియజేశారు. అదేవిధంగా పలు సమస్యలపై చర్చి వారి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ని తిరిగి అధికారంలోకి తీసుకురావడమే ఏకైక లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని, జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు అందిన ఆర్థిక సహాయాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని,బూత్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలను పటిష్టం చేసి, ఓటర్లను సమన్వయం చేసుకోవాలని,ప్రజల పక్షాన నిలబడి, అధికార పార్టీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని సూచిస్తూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరం కృషి చేద్దాం అనిప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ రవీంద్ర రెడ్డి నుంచి రూ.50 వేల విరాళం



**పులివెందుల,మన జనప్రగతి జూలై 21 :-** పులివెందులలోని రామతులశమ్మ చిన్న పిల్లల ఆసుపత్రి వైద్యులు డాక్టర్ రవీంద్ర రెడ్డి తన తల్లి స్వర్గీయ రామతులశమ్మ జ్ఞాపకార్థం స్నేహిత అమృత హస్తం సేవాసమితి నూతన భవన నిర్మాణానికి రూ.50 వేల విరాళాన్ని అందజేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన సేవాసమితి అధ్యక్షుడు రాజుకు విరాళాన్ని అందించి, సమాజ సేవలో సేవాసమితి చేస్తున్న కృషిని అభినందించారు. భవిష్యత్తులో కూడా తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. సేవాసమితి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ, నిర్మాణంలో ఉన్న మూడు అంతస్తుల భవనంలో ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన, నేత్రదాన కార్యక్రమాలు, విద్యార్థులకు ఉచిత శిక్షణ, యువత, మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యులు డాక్టర్ రవీంద్ర రెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సురేష్, రాఘవేంద్ర రెడ్డి, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల మున్సిపాలిటీలో ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమీక్షా సమావేశం





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 21:-**పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో ఎస్.ఐ.ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ / ప్రత్యేక సమగ్ర సర్వే) కార్యక్రమంపై మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ చిన్నయ్య,మున్సిపల్ కమిషనర్ తనూజ కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడూతూ ప్రతిబి.ఎల్.ఓ తమకు నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రక్రియ అంతటా ఎటువంటి తప్పులు,పొరపాట్లు జరగకుండా అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి ముని కుమార్ తో పాటు ఇతర మున్సిపల్ సిబ్బంది, బి.ఎల్.ఓలు పాల్గొన్నారు.

## ఉప్పర పల్లి హెల్త్ సెంటర్లో గర్భవతులు చిన్నపిల్లలపై సమీక్ష





**చెన్నూరు మన జనప్రగతి జులై 21:-** చెన్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉప్పరపల్లి గ్రామంలో ఉన్న హెల్త్ సెంటర్లో మంగళవారం గర్భిణీ మహిళలు చిన్నపిల్లలకు అందుతున్న సేవలపై జిల్లా హెల్త్ ట్రాన్స్ఫర్ట్ టీం సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ ఏ రమేష్ సూపర్వైజర్ ఎస్ కుమార్ నారాయణసమీక్ష లో పాల్గొంటూ గర్భవతులకు అనుకున్న సేవలు చిన్నపిల్లలకు వ్యాక్సినేషన్ సేవలు గర్భవతులకు అనీమియా గురించి రక్త పరీక్షలు గురించి తగు సూచనలు ఇవ్వడం జరిగింది ,అందులో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రి యందు కాను పైన తల్లులకు నగదు ప్రోత్సా కం గురించి తెలియజేశారు ,ఈ కార్యక్రమంలో ఎం ఐ ఎస్ రాజశేఖర్ ఎం పి హెచ్ ఈ ఓ ప్రసాద్ హెల్త్ సూపర్వైజర్ రాఘవ సుబ్బరామయ్య ఎం పి హెచ్ ఏ నరసయ్య సిహెచ్ఓఎస్ బాబులమ్మ వైద్య సిబ్బంది అహ్మద్ దస్తగిరి అమ్మ శ్రీదేవి మహేశ్వరి పద్మావతి వరలక్ష్మి లక్ష్మి పాల్గొన్నారు,

# రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణను విరమించుకోవాలి

- డాక్యుమెంట్ రైటర్ల జీవనోపాధిని కాపాడాలి
- ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి పులివెందుల డాక్యుమెంట్ రైటర్ల వినతి





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 21:** రిజిస్ట్రేషన్ శాఖలో ప్రతిపాదించిన ప్రైవేటీకరణ, పీపీపీ విధానం మరియు ఆర్ఎస్కే కేంద్రాల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తూ జీవో నెంబర్ 396ను తక్షణమే రద్దు చేయాలని పులివెందుల డాక్యుమెంట్ రైటర్స్ డిమాండ్ చేశారు.మంగళవారం పులివెందులలోని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి స్వగృహంలో డాక్యుమెంట్ రైటర్స్ అందరూ కలిసి ఆయనను కలిశారు.ఈ సందర్భంగా తమ సమస్యలు,ఆందోళనలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీకి సమర్పించారు.ఈ సందర్భంగా డాక్యుమెంట్ రైటర్లు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాల వల్ల తమ జీవనోపాధి దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి భంగం కలిగించేలా ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని, తమ పక్షాన నిలబడి పార్లమెంట్ తదితర వేదికలపై పోరాడాలని ఎంపీ అవినాష్ రెడ్డిని కోరారు.డాక్యుమెంట్ రైటర్ల విజ్ఞప్తిపై ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.ఈ విషయాన్ని ఉన్నతాధికారులు మరియు సంబంధిత వర్గాల దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని తెలిపారు.డాక్యుమెంట్ రైటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా,న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ విరూపాక్షి బసవరాజు,డి.సి.వి. ప్రసాద్, ఒంటెద్దు రామాంజనేయ రెడ్డి,భార్గవ,ఒంటెద్దు శివ రామలింగారెడ్డి,వీజీ వలి, నరేష్,అమీర్ భాష, రియాజు,విజయ్,రఫీ,వంశీ, సలీం,రాజశేఖర్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# మహిళలపై దాడులను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ధర్నా






**కాకినాడ మన జనప్రగతి జూలై 21:**-రాష్ట్రంలో మహిళలపై పెరుగుతున్న దాడులు, అఘాయిత్యాలను నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కాకినాడలో నిరసన ధర్నా నిర్వహించారు. నగరంలోని ఇంద్రపాలెం సర్కిల్ వద్ద ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. సుమారు 40 మంది జిల్లా మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు ధర్నాలో పాల్గొని, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వినతిపత్రం సమర్పించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా మహిళలపై దాడులు,హత్యలు,హత్యాచారాలు పెరుగుతున్నాయని మహిళా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు, బద్వేలు సంఘటనలే ఇందుకు నిదర్శనమని, ప్రభుత్వ చేతగానితనం మరియు నిర్లక్ష్య వైఖరి వల్లే అధికార పార్టీ నాయకులు ఇటువంటి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో రాజ్యాంగ బద్ధమైన పాలన పక్కనపడి "రెడ్ బుక్" రాజ్యాంగ పాలన సాగుతోందని, పోలీస్ యంత్రాంగం కూడా అధికార పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తోందని విమర్శించారు.ప్రజలందరూ ఈ పరిణామాలను గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు మాజీ కూడా చైర్మన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి(కుమార్) జమ్మలమడక నాగమణి, విజయలక్ష్మితో పాటు పెద్ద సంఖ్యలో మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రముఖ స్వర్ణ వ్యాపారి కె.వి ప్రసాద్ కుమారుడి పుట్టినరోజు... దివ్యాంగులకు ఆర్థిక సాయం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 21:** పులివెందులకు చెందిన ప్రముఖ స్వర్ణకారుడు, రియల్ ఎస్టేట్ వ్యాపారి కదిరిసాని వెంకటప్రసాద్ (కేవీ ప్రసాద్) తన కుమారుడు సాయి వివాన్ 10వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు.పాత శ్రీరామ థియేటర్ రోడ్డులోని స్వగృహంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు,దివ్యాంగుల నడుమ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు.ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో నడుస్తున్న టైలరింగ్ శిక్షణ కేంద్రంలోని మహిళా దివ్యాంగులకు ఆర్థిక సాయంతో పాటు పండ్లు,స్వీట్లు పంపిణీ చేశారు.కుటుంబంలో ఎవరి పుట్టినరోజు వచ్చినా పేదలకు,దివ్యాంగులకు చేయూతనివ్వడం ప్రతియేటా ఆనవాయితీగా వస్తోందని,సమాజ సేవకు తమ కుటుంబం ఎల్లప్పుడూ ముందుంటుందని కేవీ ప్రసాద్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కేవీ ప్రసాద్ దంపతులు,కుమార్తె హరీశలక్ష్మి, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- ఏపీకార్ల వద్ద పోస్టర్ ఆవిష్కరణ



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జులై 21:-** రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జిల్లాలోని అన్ని రంగాల కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తక్షణమే పర్మినెంట్ చేయాలని,కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని డిమాండ్ చేస్తూ పులివెందుల ఏపీకార్ సంస్థలో ఆప్కాస్ కార్మికులతో కలిసి యూనియన్ నాయకులు పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై మండిపడ్డారు. ప్రభుత్వంలోని ప్రతి శాఖలోనూ ఆప్కాస్ కాంట్రాక్ట్,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రాత్రింబవళ్లు కష్టపడుతున్నా,వారికి తగిన ప్రతిఫలం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా అసంఘటిత రంగ కార్మికుల పరిస్థితి మరీ ఘోరంగా తయారైందన్నారు.ఔట్‌సోర్సింగ్,కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జూలై 30న కడప కలెక్టరేట్ వద్ద చేపడుతున్న భారీ ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు,అసంఘటిత రంగ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర నాయకుడు కే.విజయశంకర్, జిల్లా నాయకులు హరి, శివయ్య,అరుణ్ కుమార్, గంగిరెడ్డి,గంగాధర్ రెడ్డి, విశ్వనాథ్,అగ్రికల్చర్ కాలేజ్ ప్రతినిధులు విజయభాస్కర్, మౌనిష్,సుధీర్,రమేష్ రెడ్డి, రాజు,అలాగే హార్టికల్చర్ కాలేజ్ ప్రతినిధులు అజయ్, హర్ష,శ్రీనివాసులు,కృష్ణారెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

# వెలిదండ్ల ఎరువుల దుకాణంలో తనిఖీలు



**లింగాల మన జనప్రగతి జూలై 21:**-మండల పరిధిలోని వెలిదండ్ల గ్రామంలో ఉన్నటువంటి సాయిబాబా ఎరువుల దుకాణంపై మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి రమేష్ మాట్లాడుతూ...జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఎస్పీ గారి ఉత్తర్వుల మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు ఏవో రేమేష్ తెలిపారు. సాయి బాబా ఎరువుల దుకాణంలో తనిఖీ చేయగా ఎరువులకు సంబంధించి అమ్మకాలు, కొనుగోలుకు సంబంధించి తదితర రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించగా గోదాములో నిల్వ ఉన్న ఎరువులకు మండల వ్యవసాయ శాఖ వారి అనుమతులు లేని కారణం చేత 17.49 ఏం.టి.ఎస్ ఎరువుల బస్తాలను జప్తు చేయడం జరిగిందని వాటి విలువ =ం 5,68,800/- విలువ ఉంటుందన్నారు. ఇందులో భాగంగా 6ఏ కేసు బుక్ చేసి జాయింట్ కలెక్టర్ కు నివేదికను అందజేయడం జరుగుతుందన్నారు.ఈ దాడుల్లో వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారి జి లక్ష్మణ్ కుమార్, స్థానిక మండల వ్యవసాయ అధికారి రమేష్,కానిస్టేబుల్ ప్రతాప్ పాల్గొన్నారు.


# ముడి పొగాకుపై జీఎస్టీ 28 శాతానికి తగ్గించాలి

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాష్ట్ర మంత్రులు, ఎంపీల వినతి



**న్యూఢిల్లీ మన జనప్రగతి జూలై 21:** రాష్ట్రంలో ముడి పొగాకు (హెచ్.ఎస్.ఎన్ 2401)పై ప్రస్తుతం అమలులో ఉన్న 40 శాతం జీఎస్టీని 28 శాతానికి తగ్గించాలని కోరుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర మంత్రులు, ఎంపీల బృందం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను మంగళవారం పార్లమెంట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జరిగిన ఈ సమావేశంలో, జీఎస్టీ పెంపు కారణంగా రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న ఎఫ్‌సీవీ పొగాకు విలువపై ప్రతికూల ప్రభావం పడుతోందని, రైతులు, డీలర్లు, ఎగుమతిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అందువల్ల ముడి పొగాకుపై జీఎస్టీని 40 శాతం నుంచి 28 శాతానికి తగ్గించాలని కోరారు.ఈ అంశం కేవలం ముడి పొగాకు (హెచ్.ఎస్.ఎన్ 2401)కు మాత్రమే సంబంధించినదని, తయారైన పొగాకు ఉత్పత్తులకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. జీఎస్టీ తగ్గింపు వల్ల పొగాకు రైతులకు ఉపశమనం లభించడంతో పాటు భారత పొగాకు ఎగుమతుల పోటీతత్వం అంతర్జాతీయ మార్కెట్లో మరింత పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ప్రతినిధులు కేంద్ర ఆర్థిక మంత్రిని కోరారు.ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, లావు శ్రీకృష్ణదేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, బస్తీపాటి నాగరాజు, బీద మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ ఎమ్మెల్యే పంతం చొరవతో వాహనదారులకు మోక్షం



**కాకినాడ మన జనప్రగతి జూలై 21:**-గుంతల మయంగా ఉన్న ఐటిఐ వెనుకాల రోడ్డు లో వెళ్లే వాహనదారులు ఇతరులు తీవ్ర ఇబ్బందులకు గురి కావడం ప్రత్యక్షంగా చూసిన రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ చొరవ తీసుకుని ఆ రోడ్డును ఎర్ర కంకరితో నింపించి చదును చేయించారు దీనితో వాహనదారులు అమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకుని ప్రయాణించడం గమనార్హం . నానాజీ చొరవ తీసుకుని దగ్గర ఉండి రోడ్డుకి మోక్షం కల్పించడంతో ప్రతిరోజు ఈ దారిలో స్కూలుకు వెళ్లే వాళ్ళు ,ఉద్యోగాలకు వెళ్లే వారు ,చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా నానాజీ చేసిన ఈ మంచి పనికి నానాజీ ని అభినందించి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

# ప్రొద్దుటూరు ఎమ్మెల్యేను కలిసిన నూతన మున్సిపల్ కమిషనర్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి జూలై 21:**-ప్రొద్దుటూరు నూతన మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్ విశ్వనాథ్ మంగళవారం స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ,ప్రొద్దుటూరు పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించే దిశగా కృషి చేయాలని ఆకాంక్షించారు. పట్టణ పరిశుభ్రత,తాగునీటి సరఫరా,మౌలిక వసతుల అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంలో సమన్వయంతో పనిచేయాలని సూచించినట్లు తెలిసింది.నూతన కమిషనర్ శ్రీనివాస్ విశ్వనాథ్ మాట్లాడుతూ...ప్రజలకు పారదర్శకమైన,జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించేందుకు కృషి చేస్తానని, ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తానని తెలిపారు.

# విద్యుత్ మరమ్మతులతో నేడు విద్యుత్ అంతరాయం

**తొండూరు మన జనప్రగతి జూలై 22:**-132/33 కేవీ బలపనూరు సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 33 కేవీ తొండూరు ఫీడర్‌లో బ్రేకర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తొండూరు ఏఈ వి. బాలసంజీవులు తెలిపారు.ఈ కారణంగా 33/11 కేవీ భద్రంపల్లి, తొండూరు, మల్లెల సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని 11 కేవీ ఫీడర్లకు చెందిన మల్లెల, భద్రంపల్లి, తొండూరు, బూచుపల్లి, కోరవానిపల్లి గ్రామాల్లో గృహ, వ్యవసాయ విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.రైతులకు ఇబ్బంది కలగకుండా వ్యవసాయ విద్యుత్‌ను బుధవారం ఉదయం 4 గంటల నుంచే సరఫరా చేయనున్నట్లు తెలిపారు. మరమ్మతుల పనులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు, రైతులు సహకరించాలని ఏఈ వి. బాలసంజీవులు విజ్ఞప్తి చేశారు.

# 117 రోజుల దీక్ష విరమించిన తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగులు



**తిరుపతి మన జనప్రగతి జూలై 21 :-** తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగులు పీఆర్సీతో కూడిన జీతాల మంజూరు కోసం 117 రోజులుగా చేపట్టిన నిరసన దీక్షను మంగళవారం విరమించారు. టీడీపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం ఉద్యోగులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.ఈ సందర్భంగా ఉద్యోగులు భారీ ర్యాలీతో డాక్టర్ బాలసుబ్రమణ్యానికి స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఉద్యోగుల సమస్య పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సహకారంతో జీవో జారీ కావడం పట్ల ఆయన కృతజ్ఞతలు తెలిపారు.బ్యాంకు ఉద్యోగులు ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలని కోరిన డాక్టర్ బాలసుబ్రమణ్యం, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ కృషి చేస్తానని చెప్పారు.అనంతరం ఉద్యోగులు మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, బ్యాంకు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.అవసరమైతే దీనిని ఇంకా చిన్న వార్తగా కూడా తయారు చేయగలను.

మనజనప్రగతి
22- 07 - 2026

# విద్యార్థులకు వరం..తల్లికి వందనం

## 10వేల కోట్ల భారం పడినా చెదరని కూటమి సంకల్పం

## విద్యాభివృద్ధికి లోకేష్ కృషి ప్రశంశనీయం: ఆఫ్కాఫ్ చైర్మెన్ యాటగిరి



**కడప మన జనప్రగతి జూలై 21:**-ఉన్నత విలువల విద్య విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం కృత ని శ్చయంతో ముందుకు వెళు తోందనిపది వేల కోట్ల భారం పడినా చెదరని సంకల్పంతో తల్లికి వందనం కొనసాగించడమే ఇందుకు నిదర్శమనిఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్ చైర్మెన్ యాటగిరి రాంప్రసాద్ స్పష్టం చేసారు.మంగళవారం నాడు విజయవాడ లోని ఆఫ్కాఫ్ చైర్మెన్ క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ..జగన్ పాలనలో కుటుంబంలో ఒకరికే లబ్ది చేకూరెదని,దీంతో ఆయా కుటుంబాలల్లో మిగతా పిల్లల చదువు తల్లిదండ్రులకు భారంగా ఉందని గ్రహించిన టీడీపీ అధినేత చంద్రబాబు కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంత మందికి ఇస్తామని హామీ ఇచ్చారన్నారు.అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి విద్యార్థికి తల్లికి వందనం లబ్ది కల్పించారన్నారు.ఈ ఆర్థిక సంవత్సరంకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 67,47,190మంది విద్యార్థులకు వారి తల్లులు 42,70,802 మంది ఖాతాల్లో 10వేల 120కోట్ల పై చిలుకు ఈ నెల 22వ తేదీ నుంచి జమ చేయనున్నారన్నారు.ఈ సంవత్సరం గ్రామీణ అంగన్వాడీ కార్యకర్తల పిల్లలకు కూడా వర్తింప చేయడం అభినంద నీయమని పేర్కొన్నారు.తల్లికి వందనంతో పాటు విధ్యాభివృద్ధికి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి ప్రశంశనీయమన్నారు.ఆయన పని తీరుతోనే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో సీట్లు ఖాళీ లేని పరిస్థితి చూస్తున్నామని చెప్పారు.ఆర్థిక ఇబ్బందులు వున్నా సామాజిక పింఛన్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితం ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు అందుస్తున్న ఘనత చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ కడప జిల్లా మీడియా కో ఆర్డినేటర్ జనార్ధన్, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ మానా చంద్ర శేఖర్,4వ డివిజన్ యూనిట్ ఇంచార్జి ఆవుల వెంకటేష్ లు పాల్గొన్నారు.

# సచివాలయ సిబ్బందిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు



**చిట్వేలి మన జనప్రగతి జూలై 21:**-సచివాలయ సిబ్బందిపై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చిట్వేలి పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం సుమారు 3.00 గంటలకు చిట్వేలి మండలం కేఎస్. అగ్రహారం కు చెందిన జంబి ఈశ్వరయ్య ఏ ఈశ్వర్ రెడ్డితన భార్య పేరు నూతనంగా తయారు చేసిన ఓటరు జాబితాలో నమోదు కాలేదనే అనుమానంతో తన పొలం నుండి నేరుగా గ్రామ సచివాలయానికి వెళ్లి అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని బెదిరించారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న వెంటనే చిట్వేలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకుని జంబి ఈశ్వర్ రెడ్డిని చిట్వేలి పోలీసు స్టేషన్ కు తరలించి అతని పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినోద్ కుమార్ తెలిపారు.

# పులివెందుల లయోలా కళాశాల సమీపంలో వాహనాల తనిఖీ

- ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి
- నిబంధనలు ఉల్లంఘిస్తే ఈ-చలాన్లు: అర్బన్ ఎస్ఐ తిమోతి




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి జూలై 21:**- కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు,పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ పర్యవేక్షణలో ఎస్ఐ తిమోతి తన సిబ్బందితో కలిసి పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాల సమీపంలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ద్విచక్ర,నాలుగు చక్రాల వాహనాలకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్,రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్,పొల్యూషన్ సర్టిఫికేట్ తదితర పత్రాలను పరిశీలించారు.సరైన పత్రాలు లేని వాహనదారులకు మోటారు వాహన చట్టం ప్రకారం ఈ-చలాన్లు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్ఐ తిమోతి మాట్లాడుతూ, వాహనదారుల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని,ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు.నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని,వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలని సూచించారు.అలాగే,మద్యం సేవించి వాహనాలు నడపకూడదని,అతివేగం,సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం,ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని ఎస్ఐ తిమోతి హెచ్చరించారు.చిన్న నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు కారణమవుతుందని,ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని ఆయన కోరారు.ప్రజల భద్రత దృష్ట్యా ఇటువంటి ప్రత్యేక వాహన తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# పేదల ప్లాట్లను కాపాడండి..!



**వేంపల్లె మన జనప్రగతి జూలై 21:**-స్థానిక హనుమాన్ జంక్షన్ సమీపంలో కడప రోడ్డులో ఉన్న పేదల ప్లాట్లను కాపాడండి అని నగర పంచాయితీ మాజీ సభ్యుడు వేంపల్లె నాగన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిని చిరివేయపు రాజు వెంకట యోగేంద్ర ప్రసాద్ స్వామి అనే వ్యక్తి తన భూమిని ప్లాంట్ గా వేంపల్లె గ్రామ పోలంలోని సర్వే నెంబర్ 164,165 కు సంబంధించి 1997 లో వేయడం జరిగిందన్నారు. అ ప్లాంట్ ను దాదాపు 92 మంది దళితులు అప్పట్లో కొనుగొలు చేయడం జరిగిందన్నారు. ప్లాంట్ కొనుగోలు చేసిన లబ్దిదారులు అందరూ వేంపల్లె సబ్ రిజిష్టారు కార్యాలయంలో వారి పేర్లతో కొనుగొలు చేసిన ప్లాంట్ ను రిజిస్ట్రేషన్ కూడ చేయించు కోవడం జరిగిందన్నారు . అ ప్లాంట్ ల్లో కొందరు పునాదులు తీసుకొని, మరి కొందరు గృహలు నిర్మించుకోవడం జరిగిందన్నారు . ఇసిలు కూడ ప్లాంట్ లను కొనుగొలు చేసిన దళితుల పేర్ల తోనే ప్లాంట్ గా ఇప్పటికి కూడ వస్తున్నాయన్నారు. 2013లో తాహసిల్దారు కూడ ప్లాంట్ గానే 1బి లో ఇవ్వడం జరిగింది. అలాగే 2025 లో తాహసిల్దారు హరినాథ్ రెడ్డి కూడ ప్లాంట్ గానే ఇవ్వడం జరిగింది. అయితే వేంపల్లెకు చెందిన మాజీ ఎంపిటిసి సింగారెడ్డి రఘునాథరెడ్డి, తెలంగాణ వలి, బత్తల జయశంకర్, గడ్డం గురు ప్రసాద్, బత్తల శంకరయ్య లు వచ్చి ఈభూమి మాది అంటూ అడ్డు పడుతున్నారన్నారు. కాబట్టి దళితులు కొనుగొలు చేసిన ఇంటి స్థలాలను దళితులకు చెందేలాగ అధికారులు ప్రభుత్వం చర్యలు తీసుకోని మాకు న్యాయం చేయాలి.ఈ సమస్యపై వేంపల్లి నాగన్న (మాజీ నగర పంచాయతీ సభ్యుడు, వైఎస్సార్ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు), సి. ఆంథోని, డి. దేవదాసు, టి. శ్రీరాములు తదితరులు బాధిత కుటుంబాలకు మద్దతు తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసిన 92 కుటుంబాలకు న్యాయం జరిగేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పలువురు మహిళలు కన్నీటి పర్యంతమై తమ ఆవేదనను వ్యక్తం చేశారు. “30 ఏళ్లుగా మా వద్ద ఉన్న ప్లాట్లను కాపాడుకోవడానికి ఎంత దూరమైనా వెళ్తాం. న్యాయం జరిగే వరకు మా పోరాటం ఆగదు. 92 కుటుంబాల హక్కులను పరిరక్షించాలి” అని బాధితులు స్పష్టం చేశారు.

# ఎంపీడీఓపై ఫిర్యాదుపై డిప్యూటీ సీఈఓ విచారణ



**సిద్ధవటం మన జనప్రగతి జూలై 21:**-సిద్ధవటం మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) ఫణి రాజకుమారిపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా పంచాయతీ కార్యాలయ డిప్యూటీ సీఈఓ రామచంద్ర మంగళవారం విచారణ నిర్వహించారు. మండల అధ్యక్షురాలు జ్యోతి వెంకటమ్మ ప్రతినిధి చంద్ర చేసిన ఫిర్యాదు మేరకు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్న ఆయన, ఎంపీడీఓ ఫణి రాజకుమారి, చంద్రలను విడివిడిగా విచారించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఈఓ రామచంద్ర మాట్లాడుతూ, విచారణలో వెలుగులోకి వచ్చిన అంశాల ఆధారంగా సమగ్ర నివేదికను సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు. ఈ విచారణలో డీఎల్‌డీఓ వెంకటసుబ్బయ్య, సీఈఓ కార్యాలయ సిబ్బంది భాస్కర్ రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ సోమశేఖర్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# కేతరాజుపల్లిలో మహిళల భద్రతపై అవగాహన సదస్సు

**రైల్వేకోడూరు మన జన ప్రగతి జూలై 21:**-రైల్వే కోడూరు నియోజకవర్గం పుల్లంపేట మండలం కేతరాజుపల్లిలో కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ భద్రత, పోక్సో చట్టం, బాల్య వివాహాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువత, బాలబాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలపై వేధింపులు, గృహ హింస వంటి ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, ఓటీపీలు ఎవరికీ చెప్పరాదని హెచ్చరించారు.పోక్సో చట్టం ప్రకారం బాలికలపై లైంగిక వేధింపులు తీవ్రమైన నేరమని, పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అలాంటి ఘటనలు తెలిసిన వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

# పీహెచ్‌సీ వైద్యుల సంఘం నూతన కమిటీకి డీఎంహెచ్‌వో శుభాకాంక్షలు



**కాకినాడ మన జనప్రగతి జూలై 21:**-రాష్ట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం జిల్లా నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కె. అనితను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు అందుకున్నారు.ఇటీవల జరిగిన సంఘం ఎన్నికల్లో జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికైన డాక్టర్ బి. మౌనిక ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎస్. రాజీవ్ కుమార్, కోశాధికారి డాక్టర్ యువకిశోర్,ఉపాధ్యక్షులు డాక్టర్ సి.హెచ్.భావ్యశ్రీ, డాక్టర్ కె.వి.నరేష్,సంయుక్త కార్యదర్శులు డాక్టర్ ఎస్. ఇందిర, డాక్టర్ ఎన్.పరదేశ్ తదితరులు డీఎంహెచ్‌వోను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ కె. అనిత నూతన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ ఆరోగ్య సేవల బలోపేతానికి వైద్యుల సంఘం కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.సంఘం ప్రతినిధులు ప్రజారోగ్య పరిరక్షణ, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల సమర్థ అమలుకు వైద్య ఆరోగ్యశాఖతో సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# తల్లి,కుమారుడి అదృశ్యంపై కేసు నమోదు

## - ఆచూకీ కోసం పోలీసుల ముమ్మర గాలింపు



**గాలివీడు మన జనప్రగతి జూలై 21:**-అన్నమయ్య జిల్లా గాలివీడుకు చెందిన ఈశ్వరమ్మ (40), ఆమె కుమారుడు రంజిత్ కుమార్ రెడ్డి (2) జూలై 14న అదృశ్యమయ్యారు. వీరు గాలివీడు టౌన్, నూలివీడు రోడ్డులోని తమ ఇంటి నుండి 14 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులైన రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు జులై 21 వ తేదీ మంగళవారం గాలివీడు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలిస్తున్నారు. వీరి ఆచూకీ తెలిసిన వారు వెంటనే గాలివీడు ఎస్ఐ (9121100556), లక్కిరెడ్డిపల్లి సర్కిల్ సీఐ (9121100554), లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలిస్ వారు ఆదేశాలు జారీ చేశారు.

# రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వ మరో ముందడుగు

## - “పొలం పిలుస్తోంది“ కార్యక్రమంలో కందుల విత్తనాల పంపిణీ



**సింహాద్రిపురం మన జనప్రగతి జూలై 21:** రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన “పొలం పిలుస్తోంది“ కార్యక్రమంలో భాగంగా సింహాద్రిపురం మండలంలోని ముసల్‌రెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం రైతులకు కందుల విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్టు హై లెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, వెంపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ అజ్జుగుట్టు రఘునాథరెడ్డి పాల్గొని రైతులకు కందుల విత్తనాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. నాణ్యమైన విత్తనాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికత, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి రైతుకు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.అనంతరం రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏవో రామాంజులరెడ్డి, ఏఈవో అభిలాష్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174